ఆదివారం

ప్రజాశక్తి

అక్టోబరు 5, 2003

మానవాళి ఉనికికే సవాలు వాయు కాలుష్యం



హ్యాపీ బర్త్‌డే

(5-10-2003 నుండి 11-10-2003 వరకు)

సాయిసుజిత్
1॥సం,5. 10. 2002
కళ్యాణి- శ్రీనివాస్
రామచంద్రపురం- కృష్ణా

ఆనందకుమార్
10॥సం, 5. 10. 1993
లక్ష్మీదేవి- ఆంజనేయులు
అనంతపురం

ఎం. వివేక్
6॥సం, అక్టోబర్-1997
సత్యవతి- శ్రీనివాసరావు
మొగల్రాజపురం- విజయవాడ

షేక్‌రిజ్వానా
3॥సం, 9. 10. 2000
మాభున్నీ- మహబూబ్
గిద్దలూరు- ప్రకాశం

మౌనిక
4సం॥, 6. 10. 1999
విజయకుమారి-వెంకటేశ్వరరావు
విజయవాడ

వెంకటసాయి వరప్రసాద్
5॥సం, 1999
పద్మావతి- వెంకటేశ్వరరావు
మార్కాపురం- ప్రకాశం

హర్షవర్ధన్‌రెడ్డి
1॥సం,అక్టోబర్-2002
పద్మావతి- మల్లిఖార్జున
వేదాయపాలెం- నెల్లూరు

మానుకొండ రాజేష్
1సం॥,9.10.2002
సౌజన్య- సురేంద్రనాథ్
యడ్లపాడు- గుంటూరు



జశ్వంత్ కుమార్
2సం॥, అక్టోబర్ - 2001
లలిత-యాదయ్య
షాబాద్-రంగారెడ్డి

మహమ్మద్ సైఫ్
మారియా-ఎం ఎ సయీద్
హైదరాబాద్

మనలో మాట

శ్రీకృష్ణార్పణం!

మంచి కాపుమీదున్న మన మామిడి తోటకి -

గట్టి కాపలా పెట్టడం మంచిది!

కాపలా వుందని తెలుస్తే - మన తోట మీద ఈగ కూడా వాలదు. కాపలా లేని తోట మీదే మంది కళ్ళు పడతాయి! దుష్ట కోరికలు పెరిగిపోతాయి!

ఫలితంగా -

మన తోట మీద రాళ్ళ వర్షం కురుస్తుంది! పిందెలు కాయలు పళ్ళు అనే తేడా లేకుండా - దొంగలు తెచ్చిన బుట్టలు నిండిపోతాయి!

మాట వరసకి మామిడి తోట అన్నానేగాని - కట్టుదిట్టమైన కాపలా లేకపోతే ఏ తోటైనా ఇంతే! అలుసై పోతుంది!

దొంగలకు ఆశలు పెరిగిపోతాయి. వాళ్ళ దాడులలో ముచ్చటైన మన మామిడితోట ముదనష్టమవుతుంది!

అంచేత -

మన తోట క్షేమంగా వుండాలనుకుంటే - మనం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి!

రాత్రింబవళ్ళు మన తోటను వెయ్యి కళ్ళతో కనిపెట్టుకునుండాలి. దొంగలొస్తే తిరగబడే దమ్ములుండాలి. కర్రోకత్తో చేత్తో పుచ్చుకునే ధైర్యముండాలి!

ఎవర్రావాడు అని మనం కేక పెడితే - ఆ కేక దొంగ గుండెల్లో సోడా కొట్టినట్టుండాలి! దాంతో దొంగ అదిరిపోవాలి. పళ్ళ బుట్ట వదిలేసి కాలికి బుద్ధి చెప్పి పరుగెత్తాలి!

కొమ్మోరెమ్మో అడ్డం పడి బోర్లా పడ్డ దొంగ - గంభీరమైన మన రూపం చూచి గుండె పగిలిచావాలి!

అప్పుడే మన తోట క్షేమంగా వుంటుంది!

మన చేతిలో కర్రగానీ కత్తిగానీ లేనప్పుడు - దొంగ వెధవ డోంట్‌కేరంటాడు. మనం కేకలు పెడుతున్నా కించిత్తు కూడా పట్టించుకోడు. అదరకుండా బెదరకుండా తన పని తాను చేసుకుపోతాడు!

మన పెర్సనాలిటీ, మన రూపం దివాళా తీసిన టైపులో వుంటే - మళ్ళా రేపు రాత్రికి వచ్చి పని చూసుకుంటానని మనకి వార్నింగిచ్చి వెళ్ళిపోతాడు. దిక్కున్న చోట చెప్పుకోమని సలహా కూడా ఇస్తాడు!

మన కళ్ళముందే మన ఆస్థిని దోచుకుపోతుంటే కృష్ణార్పణం అనుకోడమే మనవంతు అవుతుంది!

మన తోటకి కాపలా కాయడానికి మన రూపంగానీ, గుణంగానీ సూటు కానప్పుడు - ఆ పనికి కిరాయి యిచ్చి భీముడ్ని పెట్టుకోవాలి. వంద ఖర్చవుతుందని భీముడు తన రేటు చెబితే - రెండొందలు పుచ్చుకోమని ఆశ పెట్టాలి! అందుకు భీముడు అంగీకరించిన పిదప - మన తోటకి సాక్షాత్తు భీమసేనుడే కాపలా వున్నాడని పేపర్లో ప్రకటించాలి!

భీముడి పేరు వినగానే దొంగలు మన తోటలో అడుగుపెట్టేందుకు అరవైసార్లు ఆలోచిస్తారు. పట్టుబడితే భీముడు కాలో చెయ్యో తీసేస్తాడని భయపడతారు. అందువల్ల మనతోట కల్లో కూడా కనిపించకూడదని జాగ్రత్త పడతారు!

ఈ నేపథ్యంలో-

మనం నమ్ముకున్న భీముడు తోట డ్యూటీని గాలికొదిలేసి తిని తొంగోడం అలవాటు చేసుకుంటాడు. ఎందుకైనా మంచిదని తన గొంతు టేపులో ఎక్కించి జాగ్రత్త పడతాడు. ఆ టేపు తెల్లవార్లూ తిరుగుతూనే వుంటుంది. భీమసేనుడు హాయిగా నిద్దరోతూనే వుంటాడు!

తెల్లవార్లూ తిరిగే టేపులో భీముడి గొంతు ఇట్లా వినిపిస్తూనే వుంటుంది - "మేలుకునే వున్నా! మర్యాదగా వెళ్ళిపోండి!"

ఈ టైపు భీముళ్ళు మామిడితోటకి కాపలా వుంటే - ఆ తోట మట్టికొట్టుకుపోతుంది! రాష్ట్రానికి కాపలా వుంటే - ఆ రాష్ట్రం గాలికొట్టుకుపోతుంది! దేశానికి కాపలా వుంటే - ఏం చెప్పను? ఇంతే సంగతులు ! కృష్ణార్పణం! ●

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . . 2
రియల్ స్టోరీ	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 8
గేయలహరి	. . . 9
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 15
క్రీడారంగం	. . . 17
కథ	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
కళాసాహితి	. . . 21
పలుకుబడి	. . . 24

ఇంకా...

మీ పిల్లల్ని లైబ్రరీకి తీసుకెళుతున్నారా?

బాలవికాసం . . . 10

రేస్ ట్రాక్ - యాస్ టాక్

కచేరి . . . 14



చారిత్రక దుర్గం చంద్రగిరి

టూరిస్ట్‌గైడ్ . . . 16



నీటికాసులు

ఆరోగ్యం . . . 22, 23

కార్టూన్ కదంబం

మంచిగా..ప్రసంగించిన వాళ్ళకే పులిరాజా టైటిల్ ఇస్తాం..సార్!!
ఎయిడ్స్‌పై
బాబు


ఛి ఛీ.. సి.ఎం ఇంటిముందు అడుక్కుంటున్నావా? కాసింత సిగ్గుండాలిరా!!
రెండు ఇడ్లీ రెండు పుల్కాలే తింటాను-బాబు

జోషి రాజీనామా తిరస్కృతి
ఎవరో..డ్రామా కంపెనీ వారట, అనుభవమున్న.. ఇద్దరు నటులు కావాలట!!

'బిగ్‌బాస్' ఎవర్రా... ఉంటార్రా అని... అడిగానంతే!!

ఇక అంతా మంచినీళ్ళప్రాయమే!

ఇంటర్వ్యూకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఇ-మెయిల్ పంపాలంటే ఇంగ్లీష్!
కంప్యూటర్ నేర్చుకోవాలంటే ఇంగ్లీష్!
కాంపిటెటివ్ ఎక్జామ్స్ వ్రాయాలంటే ఇంగ్లీష్!
విదేశాలకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఎక్కడ చూసినా ఇంగ్లీష్.. ఇంగ్లీష్.. ఇంగ్లీష్..

"నేనూ ఎన్నో విధాల ప్రయత్నించి చూసాను. కాని నేను మాత్రం ఇంగ్లీషులో సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను. ఏదైనా తప్పుగా మాట్లాడేస్తానేమో అని భయంగా వున్నది".

ఇదేనా మీ ప్రాబ్లమ్...? NO PROBLEM !

మీచేత సరళంగా ఇంగ్లీషులో మాట్లాడించటానికి సులభమైన ఫార్ములా కనిపెట్టాం. అవును, **'స్పీచ్ జనరేటింగు ఫార్ములా' SGF™** పద్ధతిలో మేము తయారుచేసిన **స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్** పాఠాలను రోజూ అరగంట చదివి ప్రాక్టీసు చేస్తే చాలు.

వ్యాకరణ దోషం లేకుండా వాక్యాలను రూపొందించి వ్రాయటం నేర్చుకొని ఇంగ్లీషులో తడబడకుండా సరళంగా మాట్లాడటానికి మీవల్ల అవుతుంది. ఇప్పటికే **15** లక్షల మంది ఈ శిక్షణ ద్వారా ఫలితం పొందారు.

ఇంకా ఏంటి ఆలోచిస్తున్నారు?

వెంటనే క్రింద వున్న కూపను పూర్తిచేసి పంపండి. కోర్సు పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్ వద్ద **రూ.395/-** చెల్లించి పాఠాలను తీసుకోండి.

ప్రతిరోజూ అరగంట పాఠాలు చదివి ప్రాక్టీసు చెయ్యండి, ఇంగ్లీషులో గడగడమని మాట్లాడండి.

ఇదిగో కూపన్

Yes, నేను అరగంట సమయం కేటాయించి ఇంగ్లీషు నేర్చుకోవాలని ఆశిస్తున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా వెంటనే పంపండి. పోస్టుమేన్ వద్ద **రూ.395/-** చెల్లించి తీసుకుంటాను.

పేరు: ....

చిరునామా: ....

....

.... PIN..............

పాఠాలతో పాటు 416 పేజీల ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీ ఉచితంగా పొందండి.

VIVEKANANDA INSTITUTE

9 (T), Madley Road, T.Nagar, Chennai - 600 017.

Dic

PSKT

వివేకానంద ఇన్‌స్టిట్యూట్
స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్
ఇక ఇంగ్లీష్ మంచినీళ్ళప్రాయమే!

10/TEL/03/NAGA

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (•S.R.NAGAR ☎ 23714330. •MEHDIPATNAM ☎ 55755888. •DILSUKH NAGAR ☎ 24044352. •KUKATPALLY ☎ 55341431. •RAMACHANDRA PURAM. •VANASTHALI PURAM ☎ 24122464. • A.S.RAO NAGAR). •NELLORE ☎ 2327702. •THIRUPATI ☎ 2252878. •ANANTAPUR ☎ 241029. •KAKINADA ☎ 2386638. •VIJAYAWADA ☎ 5530053. •GUNTUR ☎ 2238541. •VISAKHAPATNAM ☎ 2738892. •KURNOOL. •RAJAHMUNDRY ☎ 2422003. •NIZAMABAD ☎ 235767. •CUDDAPAH ☎ 224445. •KARIMNAGAR ☎ 2234883. •WARANGAL ☎ 2578946. •MIRYALGUDA ☎ 230130.

✻ పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

అర్ధరాత్రి పన్నెండు గంటలు.

విశాఖపట్నం కేంద్ర కారాగారంలో నిశ్శబ్దం తాండవిస్తోంది. జైల్లో ఖైదీలు మంచి నిద్రలో ఉన్నారు. నియాన్‌లైట్ల వెలుగులో పహరా కాస్తున్న గార్డుల బూటు చప్పుళ్ళు మెల్లగా వినిపిస్తున్నాయి.

ఆకాశం నిర్మలంగా ఉంది.

జైలు ప్రశాంతంగా ఉంది.

దూరంగా సింహాచలం కొండల పక్క నుండి అరుస్తూ తీతువుపిట్ట వస్తోంది.

జైలు తల్లి

నిద్రలో అప్పలమ్మ ఉలిక్కిపడింది.

పక్కన తడిమి చూసుకుంది.

హాయిగా నిద్రపోతున్న పాప అరుంధతి మెత్తగా తగిలింది. ఆప్యాయంగా గుండెలకు హత్తుకుంది.

కళ్ళల్లో మత్తు నెమ్మదిగా దిగిపోయింది.

రేపు ఎలా అన్న ఊహ భయపెట్టింది.

దూరంగా ఉన్న లైటు కాంతి వరండాలో నుంచి ప్రతిఫలిస్తూ జైలు గదిలోకి వస్తోంది.

అప్పలమ్మ చీకట్లో కళ్ళు తెరిచింది.

నెమ్మదిగా లేచి కూర్చుని కూతురు అరుంధతి మీద చెయ్యి వేసి ఆప్యాయంగా నిమిరింది.

జైలు నిద్రలో జోగుతోంది.

అప్పలమ్మకు మాత్రం నిద్ర రావడం లేదు. 'రేపటి నుంచి తను ఒంటరి... తన పేగు బంధం తెగిపోతుంది... తన రక్తం తన నుంచి వేరైపోతుంది–" అన్న వూహ భరించలేకపోతోంది.

ఒక్కసారి దుఃఖం తన్నుకు వచ్చింది.

ఉబికి వస్తున్న కన్నీళ్ళను తుడుచుకోవాలని కూడా అన్పించలేదు.

రెండేళ్ళ అరుంధతి నిద్రలోనే కదిలింది.

అప్పలమ్మ చెయ్యి అప్రయత్నంగా మెల్లగా తడుతూ జోకొట్టింది.

ఆమెకు గతం ఒక్కసారి కళ్ళ ముందు మెదిలింది.

* * *

విశాఖ జిల్లా హుకుంపేట మండలానికి చెందిన అప్పలమ్మ ఒక హత్యానేరం కింద 2002 ఆగస్టులో రిమాండు ఖైదీగా విశాఖపట్నం సెంట్రల్ జైలుకు వచ్చింది.

అప్పటికే ఆమె గర్భవతి.

మహిళా వార్డులో రిమాండులో ఉంచారు.

2001 డిసెంబర్ 9న అప్పలమ్మ జైలు ఆసుపత్రిలో ప్రసవించింది. ఆడపిల్లకు జన్మనిచ్చింది. సిబ్బంది అంతా ఎంతో ఆనందించారు. తల్లీ పిల్లల్ని సంరక్షించారు.

ఈ విషయం పత్రికల్లో ప్రముఖంగా వచ్చింది.

సంచలన వార్త అయ్యింది. పలు స్వచ్ఛంద సంస్థలు... అధికారులు సంఘటనకు ఎంతో స్పందించారు. జైలు అధికారుల సమక్షంలో పాపకు అరుంధతి అనే నామకరణం చేశారు. వచ్చిన వారందరూ ఆ చిన్నారికి ఎనిమిదివేల రూపాయల నగదు, కొన్ని బంగారు, వెండి ఆభరణాలను బహుమతిగా ఇచ్చారు.

అప్పటి నుంచి అరుంధతి జీవితం కొత్త మలుపు తిరిగింది.

తల్లి అప్పలమ్మ కేసు విచారణలో ఉంది.

ఆమెకు జైలు శిక్ష ఖరారు అయిపోయినా లేదా నిర్దోషిగా విడుదలైపోయినా పాప భవిష్యత్ మాత్రం అగమ్యగోచరమే.. ఎందుకంటే అప్పలమ్మకు నా అనేవారు ఎవరూ లేరు.

జైలు నిబంధనల ప్రకారం ఒకరిని మాత్రమే రిమాండులో ఉంచాలి. ఏ పాపం ఎరుగని అరుంధతిని తల్లితో పాటు జైల్లో ఉంచడం సమంజసం కాదని అధికారులు తలచారు.

అరుంధతి భవిష్యత్తు బాగుండాలంటే ఆమె బైట ప్రపంచంలోకి రావాలని తలచారు.

అప్పలమ్మను ఒప్పించారు. జైల్లో మగ్గిపోయేకన్నా అనాథాశ్రమంలో పెరగడం ఉత్తమమని సూచించారు. ఆమె అంగీకారం కూడా తీసుకున్నారు.

2003 జులై 5న పాపను అప్పగించాలని అందరూ నిర్ణయించారు. ఆ విషయం అప్పలమ్మకు కూడా తెలియజేశారు. తనతో పాటు జైలులో గడిపే కూతురిని బైట ఉంచడమే ఉత్తమమని అనిపిస్తున్నా అప్పలమ్మలో మాతృహృదయం ఒప్పుకోవడం లేదు. ఎటూ తేల్చుకోలేని సందిగ్ధావస్థలో రాత్రంతా నిద్రలేకుండానే ఆమె గడిపింది.

* * *

జులై 5 శనివారం ఉదయం 10 గంటలు...

విశాఖపట్నం సెంట్రల్ జైలులో పండుగ వాతావరణం... జైలు అధికారులంతా హడావుడిగా తిరుగుతున్నారు.

భీమునిపట్నంలో అనాథ శరణాలయం ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేశారు. జైలు అధికారులు, సిబ్బంది గంభీరంగా నిలుచున్నారు.

అప్పలమ్మ సెల్ వద్దకు లేడీ వార్డర్ వెళ్ళింది. తల్లీ కూతుళ్ళను తీసుకువచ్చారు.

అరుంధతికి అధికారులు కొత్త డ్రస్సు తొడిగారు. తల దువ్వారు. అందంగా తయారు చేశారు.

చక్కని చుక్కలా తయారైన అరుంధతిని చూసి అప్పలమ్మ ముద్దుల వర్షం కురిపించింది.

వేదిక వద్ద అందరూ నిల్చున్నారు.

జైలు అధికారులు అంగీకార పత్రాన్ని అనాథ శరణాలయం ప్రతినిధులకు అందజేశారు. అన్నీ చూసి సంతృప్తి చెందారు.

"అనాథలనే మా శరణాలయంలో చేర్చుకుంటాం. అరుంధతి అనాథ కాదు.... కాని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఈమెను చేర్చుకుంటున్నాం... చదువు, ఉద్యోగం... పెళ్లి అన్నీ మా సంస్థే చూస్తుంది" సంస్థ డైరెక్టర్ వరదరాజన్ చెప్పారు.

అప్పలమ్మ ఈ మాటలు వింటూ చూస్తోంది.

"అమ్మా! నీకు అంగీకారమే కదూ?"

ప్రశ్న పూర్తికాకముందే అప్పలమ్మ కంటి నుంచి ప్రవాహం మొదలైంది. నోటిలోంచి ఒక్క మాట కూడా బైటికి పెగల్లేదు. కన్నీటి పొరల మధ్య కూతురు అరుంధతి అస్పష్టంగా కన్పించింది.

తల అడ్డంగా ఊపిందో... నిలువుగా ఊపిందో ఎవరికీ తెలియలేదు.

అరుంధతి తల్లి ఒడిలోంచి బైటపడింది.

జైలు అధికారులు... సిబ్బంది అందరూ కరతాళ ధ్వనులు చేశారు. ఆ చప్పట్ల మధ్య అనాథ శరణాలయంలో 'అమ్మి' అనబడే స్త్రీ అరుంధతిని ఎత్తుకుంది.

కారు వరకు తీసుకు వెళ్ళారు.

అప్పలమ్మ ఆ వెనుకే వెళ్ళింది.

"నీకు అవకాశం ఉన్నప్పుడు ఎప్పుడైనా రావచ్చు. నీ పాపను చూసుకోవచ్చు. నీలాంటి అమ్మలే అక్కడ ఉన్నారు... వారు నీకన్నా ప్రేమగా చూసుకుంటారు..." అధికారులు చెబుతున్నారు.

విషాద వదనంతో ఉన్న తల్లిని చూసి మాటలు రాని అరుంధతి ఏడ్పు అందుకుంది. అప్పలమ్మ పాప దగ్గరికి వెళ్ళి తలమీద నెమ్మదిగా తట్టింది.

"నువ్వు ఎక్కడున్నా నీ వెంటే నా జ్ఞాపకాలు.. ఎంతో భవిష్యత్తు ఉన్న నీకు ఈ జైలు కన్నా ప్రపంచమే పెద్ద ఇల్లు..." మనసులోనే అనుకుంది.

అరుంధతిని ఎక్కించుకున్న జీపు నెమ్మదిగా జైలు గోడలు దాటింది. కనుచూపు మేర కన్పించినంత వరకు చూసి అప్పలమ్మ వెనక్కి తిరిగింది. నెమ్మదిగా జైలు గదిలోకి వెళ్ళిపోయింది. ●

* కె.బాలాజీ రెడ్డి

ఎచటినుండి వీచెనో ఈ చల్లని గాలి...
తీవెలపై ఊగుతూ పూవులపై తేలుతూ...
ప్రకృతినెల్ల హాయిగా...తీయగా...పరవశింపజేయుచూ...!

నేడు మహానగరంలోని ఏ మేడపై నిలుచుని అయినా ఈ పాట పాడుతూ ప్రకృతిని ఆస్వాదించే అదృష్టం ఉందా? అని అడిగితే లేదనే సమాధానం ఠకీమని వస్తుంది. ఎందుకని అడిగితే వెర్రివాడికిందే జమ. ఏమండీ..దేశంలో ఎక్కడన్నా స్వచ్ఛమైన గాలి వీస్తున్నదండీ.. అని ఎదురుప్రశ్న మనను తాకడం ఖాయం. కాలుష్యం...కాలుష్యం...కాలుష్యం.. ఎక్కడ చూసినా కాలుష్యం. ఎటు తిరిగినా కాలుష్యం.. మహానగరాలు, పట్టణాలూ కాలుష్యమయం. కాదేదీ కాలుష్యానికనర్హం..అంతా కాలుష్యం..ఇదే ఇదే నేటి వాస్తవం..ఇదేమిటీ విషయంలోకి రాకుండా ఈ కవితాధార..అంటున్నారా.. సరే..దేశంలోని మహానగరాలు, పట్టణాలు, గ్రామాలు కాలుష్యమయమైన నేటి పరిస్థితిని సంపూర్తిగా కాకున్నా రేఖామాత్రంగానైనా అవలోకిద్దాం..

మానవాళి ఉనికికే సవాలు వాయు కాలుష్యం

ఇటీవల ప్రపంచబ్యాంక్ మన దేశంలో వాయు కాలుష్యంపై తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేసింది. దక్షిణాసియాలో భారత్‌లోనే వాయు కాలుష్యం, జలకాలుష్యం అధికంగా ఉందని తన నివేదికలో పేర్కొంది. మన కాలుష్యంపై ప్రపంచబ్యాంక్ ఆసక్తి వెనకున్న కారణాల సంగతి వదిలేద్దాం..అసలు దేశంలో పరిస్థితి ఏమిటో విచారిద్దాం..నిజమే ..ప్రపంచబ్యాంకే మనకు చెప్పాల్సిన పనిలేదు. సగటు పౌరుడెవరైనా వాయు, జల కాలుష్యం గురించి ఠక్కున చెప్పగలడు. మన నగరాలూ, పట్టణాలూ కాలుష్య కోరల్లో విలవిలలాడుతున్న దుస్థితి ఇది. కాలుష్య తీవ్రత అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోతోంది. ఇది అంతిమంగా ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావం చూపుతోంది. అసలేం జరుగుతోంది? పొరపాటెక్కడ ఉంది? కారకులెవరు? దీనిని నివారించే వీలుందా? ఉంటే ఎప్పటికి? మానవాళి మనుగడకే సవాలుగా నిలిచిన వాయుకాలుష్యం తగ్గించడంలో ప్రభుత్వాలు ఎందుకు విఫలమవుతున్నాయి? ప్రజల బాధ్యత ఏమిటీ? ఆలస్యం అమృతం విషం నానుడి తెలుసు కదా...మన కర్తవ్యాలను నిర్దేశించుకోవాల్సిన సమయం

ఆసన్నమైంది.

వాయు, జల, శబ్ద కాలుష్యాలు ముప్పేట దాడి చేస్తున్న విషయం తెలిసిందే..ఇందులో అత్యంత ప్రమాదకరం, తక్షణం నివారించుకోవాల్సిన అవసరమున్నది వాయు కాలుష్యమే. గత అర్ధ శతాబ్దిగా ఈ ప్రమాదం ముంచుకువస్తున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న దుష్ఫలితమే ముందు తరాలను పీడించనుంది. ఆర్థిక సరళీకరణ విధానాల నేపథ్యంలో ఈ ప్రమాదం మరింత

తీవ్రతరమవుతోంది. ఈ విధానాల పుణ్యాన దేశంలో కీలకమైన వ్యవసాయ రంగం దెబ్బతింది. పనులు లేక ప్రజలు పట్టణాలకు, నగరాలకు పొట్ట చేత పట్టుకుని చేరే దురవస్థ దాపురించింది. దీంతో నగరాలు, పట్టణాల్లో మురికివాడలు, పారిశ్రామిక వాడలు పెరిగిపోతున్నాయి. సరైన వసతులు ఏర్పాటు చేయడం క్లిష్టంగా మారిపోతోంది. మరోవైపు వాహనరద్దీ, ఫ్యాక్టరీల నుండి వెలువడే వ్యర్థాలతో దేశంలోని ప్రధాన నగరాలు వాయు కాలుష్యకూపాలుగా తయారవుతున్నాయి. భారీస్థాయి పరిశ్రమల నుండి మధ్యతరహా, చిన్నతరహా పరిశ్రమల నుండి వెలువడే విషకారక వాయువులు, వ్యర్థాలు, వాహనాలు వెదజల్లే విషకాలుష్యం, రోడ్లు, రవాణా మార్గాలు, భారీస్థాయి నుండి స్వల్పస్థాయి వరకూ జరిగే నిర్మాణాలు, పల్లెల్లో కట్టెలపొయ్యిల ద్వారా వెలువడే పొగ, ఇంకా సహజసిద్ధంగా వెలువడే పొగ వాయుకాలుష్యానికి నిదర్శనాలు. ఇవికాక అణు కర్మాగారాల వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలూ ఉన్నాయి.

సైన్స్‌పరంగా మనం జీవించడానికి ఆక్సిజన్, నైట్రోజన్‌ల అవసరం ఉందని కొద్దోగొప్పో చదువుకున్న వారందరికీ తెలుసు. గాలిలో ఉండే ఈ వాయువులకు విషవాయువులైన కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ కలుస్తున్నాయి. దీంతో వాయు కాలుష్యం ఏర్పడుతోంది. ఇలాంటి గాలి పీల్చడం వల్ల ఏమవుతుంది? శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు, వాటివెంటే చర్మవ్యాధులు దాడి చేయడం ఖాయం. ఉబ్బసం, క్యాన్సర్, గొంతువాపు, ఉదరకోశ వ్యాధులు రావచ్చు. ప్రతిరోజూ ఐదుకోట్ల 60 లక్షల టన్నుల కార్బన్ డై ఆక్సైడ్, 1500 టన్నుల ఇతర విషకారక పదార్థాలు భూ వాతావరణంలోకి విడుదలవుతున్నట్లు శాస్త్రవేత్తల అంచనా.

సామాన్య మానవుడిపై పన్నుల భారం వేయడమేగాక ముక్కుపిండి మరీ వసూలు చేసే ప్రభుత్వం ఫ్యాక్టరీలు, పరిశ్రమల నిర్వాహకులు నిబంధనలకు నిలువు పాతర వేస్తున్నా కళ్లు తెరవడం లేదు. ప్రజల ప్రాణాలు గడ్డిపోచతో సమానంగా చూస్తూ పెట్టుబడిదారుల కనుసన్నల్లో నడుస్తున్న ప్రభుత్వాలు ఇంకేం పట్టించుకుంటాయి..?! భోపాల్ కార్బైడ్ దుర్ఘటన దేశాన్ని కుదిపేసినా బాధితులకు ఇవ్వాల్టికీ న్యాయం జరుగకపోవడం దీనికి నిదర్శనం. పలు నగర పరిసరాల్లో ఇలాంటి పరిశ్రమలు నెలకొని ఉన్నా వాటిలో సురక్షిత పరిస్థితులు ఉన్నాయో లేదో చూడని పరిస్థితి ఉంది.

ఫ్యాక్టరీల పరిసర ప్రాంతాల్లోని వారికి ముఖ్యంగా ఇది ప్రమాదకరం. ఉదాహరణకు కొన్ని సిమెంట్ ఫ్యాక్టరీల విషయం చూస్తే మూడు పదార్థాలను వినియోగించే వేళల్లో 'డస్ట్ కలెక్టర్స్' పడక్బందీగా పని చేయాలి. ఏ మా&రతం దుమ్ము, ధూళి ఇతర వ్యర్థ రసాయనిక కణాలు పైకి గొట్టాల ద్వారా విరజిమ్మబడకుండా ఉండాలి. కాని ఆ పరికరాలు సరిగా పని చేయనివే కాకుండా, ఉత్పత్తుల స్థాయి పెంచాలంటూ రోజుకు టన్నుల కొద్దీ సిమెంటును ఉత్పత్తి చేస్తుంటాయి. ఫలితంగా ఫ్యాక్టరీలపై ఉండే గొట్టాల ద్వారా నల్లపొగలు ఆకాన్ని కమ్మేస్తాయి. కిలోమీటర్ల పరిధి వరకూ అవాస కేంద్రాలపై దాని ప్రభావం ఉంటుంది.

వాయు కాలుష్యానికి దారితీస్తున్న మరో కారణం వాహన కాలుష్యం. ఇది అంతకంతకూ విస్తరిస్తోంది. డీజిల్ వాహనాల వల్ల సల్ఫర్ వాయువులు అధికంగా వెలువడుతున్నాయి. నగరాల్లో ప్రతి ఘనపు మీటరు పరిధిలో 400 నుండి 500 మైక్రోగ్రాముల దుమ్ము ఉంటోందని ఓ అంచనాలో తేలింది. దుమ్ము శ్వాసక్రియ మార్గానికి అడ్డు వచ్చి శ్వాసకోశ సంబంధ వ్యాధులు కలుగజేస్తుంది. నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, సీసం, బెంజిన్, హైడ్రో కార్బన్ వంటివి ఈ పొగలో కలిసిఉంటాయి. మొత్తం కాలుష్యంలో వాహనాల కాలుష్యం 67 శాతం దాకా ఉంటుందంటే దీని ప్రమాద తీవ్రత ఎంతో అరటిపండు ఒలిచినట్లు తెలిసిపోతోంది. వాహన కాలుష్యం వల్ల గుండె జబ్బులు, ఆస్తమా, టిబి, క్యాన్సర్, బ్రాంకైటిస్ వంటి వ్యాధులు సోకుతున్నాయి. రోజూ వివిధ రకాల వాహనాలు 500 టన్నులకుపైగా దహనం కాని వ్యర్థాలను గాలిలోకి విడుదల చేస్తున్నాయని ఒక పరిశోధనలో వెల్లడైంది. పరిస్థితి ఇలాగే ఉంటే మరో పాతికేళ్లలో స్వచ్ఛమైన ప్రాణవాయువు దొరకడం దుర్లభమే. వాహనాల్లో ద్విచక్ర వాహనాల వల్ల వెలువడే పొగ తక్కువేంకాదు. (హైదరాబాద్ నగరంలో దాదాపు 15 లక్షలకుపైగా వాహనాలు తిరుగుతున్నాయి. వీటిలో ద్విచక్ర వాహనాల సంఖ్యే అధికం. వాహనాల నుండి వెలువడే పొగ వల్ల సుమారు 1100 టన్నుల కాలుష్య కారకాలు వెదజల్లబడుతున్నాయని అంచనా. నగరంలో 230 పరిశ్రమలను శివార్లకు తరలించాలని 1997లో ఏర్పాటైన జిల్లా పర్యావరణ కమిటీ సూచించింది. ఇందులో వెంటనే తరలించాల్సిన

కాలుష్యం కోరల్లో ఢిల్లీ



పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల భారత్‌లో వాయు కాలుష్యం తీవ్రమవుతోందని ఓ అంతర్జాతీయ సర్వే కూడా సూచించింది. ప్రపంచంలో ఏటా 30 లక్షల మంది ప్రజలు వాయు కాలుష్యం వల్ల మరణిస్తుంటే అందులో అత్యధికులు భారతీయులే కావడం దేశంలోని పరిస్థితి తీవ్రతకు దర్పణం పడుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచంలోని పది అత్యంత కాలుష్య నగరాల్లో మన దేశ రాజధాని ఢిల్లీ కూడా ఉంది. వ్యాధుల విషయంలో కూడా ఇతర నగరాలతో పోలిస్తే ఢిల్లీలో ఎక్కువని కూడా తేలింది. సగటున ఇతర ప్రాంతాలకన్నా ఇక్కడ వ్యాధుల తీవ్రత 12 రెట్లు ఎక్కువ. భారత జాతీయ స్థూల జాతీయోత్పత్తి గత రెండు దశాబ్దాల్లో రెండున్నర రెట్లు పెరిగితే వాహనాల కాలుష్యం ఎనిమిది రెట్లు పెరిగింది. అదే సమయంలో పరిశ్రమల నుండి వచ్చే కాలుష్యం నాలుగురెట్లు ఎక్కువైంది. ఇంతేగాక భారతదేశంలో ప్రతి సంవత్సరం సగటున 60 వేల టన్నుల క్రిమి సంహారక విష రసాయనాలు గాలిలో కలుస్తున్నాయి.



ఏటా ఏడున్నర లక్షల మంది బలి!

మన దేశంలో వాయు కాలుష్యం కారణంగా ఏటా ఏడున్నర లక్షల మంది అకాల మృత్యువాత పడుతున్నారని రెండేళ్ళ క్రితమే ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. దక్షిణాసియాలో పర్యావరణ పరిరక్షణ స్థితిగతులను సమీక్షిస్తూ ప్రపంచ బ్యాంకు నివేదిక ఈ విషయం తెలియచేసింది. పర్యావరణ సంబంధ సమస్యల ద్వారా చనిపోతున్నవారి సంఖ్య నానాటికీ పెరుగుతున్నట్టు కూడా ఈ నివేదిక వెల్లడించింది. పదిహేను శాతం మంది పౌష్టికాహార లోపంతో మరణిస్తే, పర్యావరణ సంబంధమైన సమస్యల కారణంగా మరణించే వారి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటున్నదని తెలిపింది.

ఇందుకు సంబంధించి ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణ స్థితిగతులను ప్రపంచ బ్యాంకు పరిశీలించి చూసింది. ద్విచక్రవాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది. తూర్పు ఆసియా తర్వాత, ఇటీవలి కాలంలో దక్షిణాసియాలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నదని, పరిస్థితి ఇలా ఉంటే దారుణ పరిస్థితులు ఎదుర్కోవలసి ఉంటుంది. నగరాలలో వాతావరణం కలుషితమైపోయి, సహజ వనరులు నానాటికీ తరిగిపోతూ, స్వచ్ఛమైన నీటికి, గాలికి నోచుకోని ప్రజల ఆరోగ్యం ఎలా ఉంటుంద మనం ఊహించుకోవచ్చు.

అంతేకాదు, విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందుల వాడకం, వ్యర్థ పదార్థాలను, పారిశ్రామిక వ్యర్థాలను నాశనం చేయడానికి తగిన సురక్షితమైన ఏర్పాటు లేకపోవడం వంటి కారణాల వల్ల పరిస్థితి రానురాను ప్రజల బతుకులను దుర్భరం చేయబోతున్నదని అంటున్నారు. ఈ సమస్యల వల్ల లక్షలాది మంది ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతినే అవకాశం వుంది. 1990లో ఆర్భాటంగా సంస్కరణలు తలకెత్తుకున్నప్పటికీ దక్షిణాసియాలో ముఖ్యంగా ఇండియాలో ఆర్థిక పురోగతి అంతంత మాత్రంగానే ఉందని, పర్యావరణ చట్టాల అమలు జవాబుదారిత్వం సక్రమంగా లేదని బ్యాంకు అభిప్రాయపడింది. ప్రపంచంలో 40 శాతం మంది పేదలు దక్షిణాసియాలోనే నివశిస్తున్న వాస్తవాన్ని కూడా గుర్తు చేసింది. పర్యావరణ పరిరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయలేకపోతున్న అంశాన్ని కూడా నివేదిక గుర్తు చేసింది.

వాటి జాబితాలో 50 పరిశ్రమలు ఉన్నాయి. కానీ వాటిని తరలించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది)

వేగంగా పారిశ్రామికీరణ, పట్టణీకరణ జరిగింది కానీ అదేస్థాయిలో పౌరుల ప్రాణాలు కాపాడే యత్నాలు, అందుకవసరమైన వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు. వాయు కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు సక్రమంగా అమలు కావడం లేదు. వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు గ్యాస్ ఆధారిత ఇంజన్లు ఏర్పాటు చేసుకోవాలని ఢిల్లీలో టాక్సీలకు సంబంధించి సుప్రీంకోర్టు రెండేళ్లక్రితం తీర్పిచ్చినా అమలుకాలేదు. పెరుగుతున్న వాహనాలు ప్రత్యేకించి ద్విచక్ర వాహనాలను నియంత్రించే వ్యవస్థే దేశంలో లేదు. వాహన కాలుష్య నియంత్రణ చర్యలు అమలు చేసే నాథుడే లేదు. ఇక పల్లెల్లో వాడుతున్న క్రిమిసంహారక మందుల వల్ల కలుగుతున్న అనర్థం చెప్పనలవి కాదు.



విచక్షణారహితంగా క్రిమిసంహారక మందుల వాడకం వల్ల పర్యావరణానికి ప్రమాదం వాటిల్లడంతోపాటు వ్యవసాయ సమతౌల్యం దెబ్బతింటోంది. వ్యవసాయదారులకు మేలు చేసే పక్షులు, కీటకాదులు అంతరించిపోతున్నాయి.

అంతిమంగా వాయు కాలుష్యం వల్ల వాతావరణ అసమతౌల్యం ఏర్పడుతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వాతావరణంలో ఉష్ణోగ్రత విపరీతంగా పెరగడానికి వాయు కాలుష్యమే ప్రధాన కారణమంటున్నారు. క్లోరోఫ్లోరో కార్బన్‌లు, హెలోజన్, బ్రోమిన్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు భూ వాతావరణాన్ని సంరక్షించే ఓజోన్ పొరను దెబ్బతీస్తాయని వారు హెచ్చరిస్తున్నారు. దేశంలో కరువు పరిస్థితులు విలయతాండవం చేయడానికి వాయు కాలుష్యమే కారణమంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మనం ఏం చెయ్యాలి?

ఈ సమస్యకు గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు పరిష్కారమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అటవీప్రాంతం వేగంగా తగ్గిపోతోంది. దీనిని పూర్వపుస్థాయికి పెంచాలి. వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి. ఇందుకు చైనాలో తీసుకుంటున్న చర్యలు మనకూ అనుసరణీయం. కాలం చెల్లిన వాహనాలను తిరగనివ్వకుండా చూడాలి. ద్విచక్ర వాహనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలు నిబంధనలు పాటించేలా కఠిన చర్యలు తీసుకోవాలి. వియత్నాం, ఫిలిప్పైన్స్, చైనా మాదిరిగా క్రిమిసంహారక మందుల వాడకాన్ని నిలిపివేసి ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలి. కాలుష్యాన్ని అరికట్టడంలో ప్రజలు తమ బాధ్యతను గుర్తించేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టడం అవసరం. ఓకే.. ఇవన్నీ ఇంతకుముందు నుండి చెప్పుకుంటున్న కొన్ని పరిష్కారాలు... అయితే వీటిని అమలు చేసే ప్రభుత్వ యంత్రాంగం సరిగా ఉండాలి. అప్పుడే సక్రమంగా అమలు జరిగేది.. మరి ఈ చర్యలు చేపట్టకుంటే ఏమవుతుంది? మానవాళి భవిష్యత్తు ప్రమాదంలో పడడమే కాదు. ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. తస్మాత్ జాగ్రత్త...!!

✻ అంపశయ్య నవీన్

"ఇంట్లోనే వున్నావా మహాశయా? ఉన్నావో, లేవో అనుకుంటూ వస్తున్నాను..." అంటూ వచ్చాడు నా చిన్న నాటి మిత్రుడు సాంబశివరావు.

"కలదు కలందనెడివాడు కలడో లేడో? అన్న సందేహమైతే నీకెప్పుడూ కల్గదు కదూ?" అన్నాను అతన్ని మా డ్రాయింగ్ రూంలో కూర్చోబెడుతూ.

"అంత పెద్ద సందేహం ఎప్పుడూ కల్గదులే.. కలదనుకోవడంలోనే మనకు బోలెడు మనశ్శాంతి దొరుకుతుంది. లేదనుకున్న వాడికి అనుక్షణం టెన్షనే..." అన్నాడు సాంబశివరావు.

భవిష్యత్తుపట్ల బలహీనత

"లేదనుకునే వాళ్ళల్లో నేనొకణ్ణి – కానీ నాకెప్పుడూ టెన్షనుండదు... ఆ విషయం ఇప్పుడు తేలేది కాదుగానీ, ఎక్కడికో వెళ్ళొస్తున్నట్టున్నావు? ఏమన్నా విశేషమా?" అన్నాను.

"విశేషమే. మొన్న నాకు మనవడు పుట్టాడు."

"కంగ్రాచ్యులేషన్స్... వంశోద్ధారకుడు పుట్టాడన్న మాట... వెరీగుడ్!"

వాడు నిజంగానే మావంశాన్ని ఉద్ధరిస్తాడా? లేదా? అన్న విషయం తెలుసుకోవడానికి ఇక్కడ మీ కాలనీలోనే ఉన్న ఓ ప్రముఖ జ్యోతిష్యుని దగ్గరకు వెళ్ళొస్తున్నాను"

"మా కాలనీలో ఉన్న ప్రముఖ జ్యోతిష్యుడంటే నరసింహరామయ్య గారేనా?"

"అవును... నరసింహరామయ్య గారంటే ఏమనుకున్నావు? సాక్షాత్ దేవునితోటి సమానం... మనం పుట్టిన తేదీ, టైమ్ కరెక్టుగా చెప్పాలేగానీ, ఆయన మన భవిష్యత్తంతా చెప్పేస్తాడు... అందుకే మా మనవడు పుట్టిన తేదీ, టైమ్ ఆయనకు చెప్పొస్తున్నాను. "మీరు మళ్ళీ రేపు రండి... మీవాడి జాతకం రాసి పెడ్తాను" అన్నాడాయన.

"నీ కింకా జ్యోతిష్యం మీద, జ్యోతిష్యుల మీదా నమ్మకముండటం చాలా ఆశ్చర్యం... నేతి బీరకాయలో నెయ్యెంతుంటుందో జ్యోతిష్యంలో నిజం కూడా అంతే ఉంటుందని ఎప్పుడో రుజువైపోయింది. మన సమాజంలో ఉన్న ఎన్నో మూఢ విశ్వాసాల్లాంటిదే ఈ జ్యోతిష్యం కూడా..."

"జ్యోతిష్యాన్ని మూఢ విశ్వాసమంటే నేనొప్పుకోను.. నా జీవితంలోనే జ్యోతిష్యాన్ని బలపరచే సంఘటనలు ఎన్నో జరిగాయి. నేను పుట్టినప్పుడే మా నాన్నగారు నా జాతకం రాయించాడు. ఆ జాతకంలో నాకు నా ఎనిమిదో ఏట పెద్ద గండం ఉందని రాసి పెట్టారు.... సరిగ్గా నా ఎనిమిదో ఏట మా ఊర్లో ఉన్న ఓ బావిలో పడి చచ్చిపోయే వాణ్ణే. ఈత నేర్చుకుందామని ఆ బావిలోకెళ్ళాను... అప్పటికి నాకింకా ఈతరాలేదు.... కాలుజారి బావిలో పడ్డాను. నా పక్కనున్న వాళ్ళు నన్ను బయటకు తీసి కాపాడారు. అట్లాగే నాకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు



పుడ్తారని జ్యోతిష్యులు చెప్పారు... సరిగ్గా అలాగే నాకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దర మగపిల్లలు పుట్టారు..." అన్నాడు సాంబశివరావు.

"నీ కిద్దరు భార్యలుంటారని కూడా జ్యోతిష్యులు చెప్పారా?" అన్నాను నేను అతనికి ఇద్దరు భార్యలున్నారన్న విషయం గుర్తొచ్చి.

"చెప్పారు.. దేవుని మీదొట్టు... ఓ జ్యోతిష్యుడు నీకిద్దరు భార్యలని బల్లగుద్ది చెప్పాడు..."

"ఇవన్నీ యాదృచ్ఛికంగా జరిగినవే తప్ప జ్యోతిష్యులు చెప్పిన ప్రకారం జరిగినవి కావు... జ్యోతిష్యానికి సంబంధించి ఈ మధ్యనే వచ్చిన ఓ రిపోర్టును గుర్చి చెబుతా విను. లండన్‌లో ఓ సంస్థ 1958లో ఒక నెలలో ఒక రోజున, ఒక టైమ్‌లో పుట్టిన ఓ రెండు వేల మంది శిశువుల వివరాలను సేకరించి వాళ్ళమీద ఓ కన్నేసి ఉంచిందట. 1958లో పుట్టిన ఈ రెండు వేల మంది జీవితాల్ని ఇప్పటిదాకా పరిశీలించి మొన్ననే అంటే ఆగస్టులో ఒక రిపోర్టును విడుదల చేసింది. జ్యోతిష్యం ప్రకారం ఈ రెండు వేల మంది జీవితాలు ఒకేలా ఉండాలి కదా. వీళ్ళ చదువు సంధ్యల విషయంలో గానీ, వీళ్ళు చేస్తున్న ఉద్యోగాల విషయంలోగానీ, వీళ్ళ పెండ్లిళ్ళ విషయంలోగానీ, ఒకరికొకరికీ ఎలాంటి సామ్యం లేదని ఈ రిపోర్టులో చెప్పారు. ఇంకా వీళ్ళ మనస్తత్వాలుగానీ, వీళ్ళ సాంఘిక సంబంధాలుగానీ, వీళ్ళ ఇంటలిజెంట్ కోషెంట్‌గానీ, లెక్కలు, లలిత కళలు, క్రీడలు మొదలైన విషయాల్లో వీళ్ళ అభిరుచులు గానీ పూర్తిగా భిన్నంగా ఉన్నాయట. 1958లో ప్రారంభమైన ఈ సర్వే రిపోర్టును మొన్న ఆగస్టులో "జర్నల్ ఆఫ్ కాన్షియస్‌నెస్ స్టడీస్" అన్న పత్రికలో ప్రచురించారు. ఎంతో శాస్త్రీయంగా జరిగిన ఈ పరిశోధనలో 'జ్యోతిష్యం'లో ఏ మాత్రం కూడా నిజం లేదని తేలిందని ఈ పరిశోధనను నిర్వహించిన "జెఫ్రీడేన్", "ఇవాన్‌కెల్లీ" అనే ఇద్దరు శాస్త్రజ్ఞులు రాశారు. ఈ పరిశోధన ఫలితాల్ని చూసైనా మనం జ్యోతిష్యుల వెంట పరుగెత్తకపోతే బావుండును..." అన్నాను.

"ఇట్లాంటి పరిశోధనల్ని నేను నమ్మను. జ్యోతిష్యాన్ని అపఖ్యాతి పాలు చెయ్యడం కోసం నీలాంటి వాళ్ళెవరో ఇలాంటి పరిశోధనల్ని నిర్వహిస్తుంటారు. ఆ రెండు వేల మంది ఒకే టైమ్‌లో పుట్టారన్న గ్యారంటీ ఏమిటి? కొన్ని సెకండ్ల తేడా ఉన్నా వాళ్ళ జాతకాలు మారిపోతాయి. వాళ్ళు పుట్టిన టైమే కాదు. వాళ్ళు పుట్టిన ప్రదేశాన్ని బట్టి కూడా వాళ్ళ భవిష్యత్తులు మారిపోతుంటాయి. ఒక ఆశ్చర్యకరమైన విషయమేమిటో నీకు తెలుసా? సైన్స్ ఎంతో అభివృద్ధి చెందిందనుకుంటున్న ఈ యుగంలో జ్యోతిష్యాన్ని నమ్మేవాళ్ళ సంఖ్య పెరిగిపోతున్నది. పత్రికల్లో ప్రచురించే వారఫలాల్ని చదివే వాళ్ళు నూటికి ఎనభైమంది దాకా ఉంటారు... జ్యోతిష్యంలో నిజం లేకపోతే ఇంతమంది జ్యోతిష్యాన్ని ఎందుకు నమ్ముతారంటావు?"

"ఎక్కువ మంది జ్యోతిష్యాన్ని నమ్మినంత మాత్రాన అది నిజమై పోదు.. సూర్యగ్రహణం, చంద్రగ్రహణం రాహుకేతులు సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ మింగడం వల్ల ఏర్పడతాయని నమ్మేవాళ్ళ సంఖ్య ఇప్పటికీ చాలా ఎక్కువగానే ఉందిట... అంతమాత్రాన అది నిజమైపోతుందా? ఇదివరకు జ్యోతిష్యులు ఇలా జరుగుతుందని ఢంకాబజాయించి చెప్పిన జోస్యాలు నిజం కాలేదు. ఉదాహరణకు 1962లో అష్టగ్రహ కూటమి ఏర్పడినప్పుడు మహాప్రళయం సంభవిస్తుందనీ, సముద్రాలు పొంగి భూగోళం మునిగిపోతుందనీ జ్యోతిష్యులందరూ చెప్పారు. ఆ జోస్యంలో ఒక్క శాతం కూడా నిజం కాలేదు. అయినా మనం ఇంకా జ్యోతిష్యాన్ని నమ్ముతూనే ఉన్నాం. భవిష్యత్తును గుర్చి తెలుసుకోవాలన్న మానవుడిలోని బలహీనతొక్కటే దీనికి కారణం. బలహీనత కారణంగానే జ్యోతిష్యులు బతుకుతున్నారు". ●

చీకట్లో బాల్యం

బాపేమో బడికి పొమ్మంటడు
పటేలేమో బాకీ కట్టుమంటడు
మా తాత ఆటాణా బాకుంటె
నీ మనుమని ముడ్డి కడిగిండు
మా అవ్వ పాశి బాసండ్లు తోమింది
మా తాత కదుగుడు, అవ్వ తోముడు కాకముందే
ఆటాణా పోయి రూపాయి అయింది
తాతా! అనుకుంటు నేను లేస్తే
బాంచెన్ దొరా! అనుకుంటూ నీ కాళ్ళ కాడ ఆలిందు
అవ్వా! ఆకలౌతున్నది అంటే
పటేల్‌సాని పాశితిండి పెట్టిందనే
పెద్దోల్ల పిల్లని తీరంగ బడికి పోతా అంటే
పటేలేమో పెండకాల్లు తీపిస్తున్నడు
తోటెయ్యతందుకు చేండ్లకు పోతే
అవ్వకు కైకిలి లేక కూరగాయలు లేక
బాపు బాడ్గకు పోతా అంటే
ఉన్న రెండు కంక బొక్కల్ని
పటేలు దొరకు తీస్కపోయిండు
మన చేండ్లల్లనేమో! సచ్చంత గడ్డి
పటేలు చేనేమో! నూనెవెట్టి దూశినట్టు నున్నగా
బాపుపేరు మీద బర్కాల గుడ్డం ఏదంటే
తైసిల్ కింద పట్వారి గుంజుకునే!!

- ఉదారి దయానంద్

సర్పం పడగ నీడలో

సర్పం పడగ నీడలో విశ్వం
ప్రపంచాన్ని సరళీకరించి
కుటిల ఎత్తులతో కోటీశ్వరులతో పొత్తుగూడి
జగతి గమనానికి 'ఇరుసు'గా ఉన్న
శ్రామికుల పేగుల్లోని పిప్పిని కూడా దోచుకు తింటూ
శవాలను సైతం అమ్ముకు బతికే
సామ్రాజ్యవాదం రాకాసి బల్లులు కక్కిన నిప్పుల వేడికి
రాలిన పచ్చని 'పేద' గడ్డిపూల వనం ఒకవైపు....
పగిలిన త్రిశూలాల తిత్తి
కడుపుల్లోని పిండాలను చీల్చి
భవిత నుదిటిపై రక్తంలో 'మతతిలకం' దిద్దుతుంటే
పొగిలిన దుఃఖంతో ప్రజాస్వామ్యం ఒకవైపు...
తమ అస్థిత్వంకై, ఆశల సాధనకై
కలబడుతూ, కూలబడుతూ, వడిబడుతూ, తొడగొడుతూ
ఏడుస్తూ, ఎదిరిస్తూ... ఎదిరిస్తూ, మరణిస్తూ
చిక్కిపోయి నిలబడ్డ చీకటి సందర్భంలో...
తడివేకువ సమయంలో....

☆ ☆ ☆

చీలిన చేతుల్ని కలుపుతూ కొత్తదారుల్ని
వెదుకుతూ
ఎండిన గడ్డిపోచల్ని మండించడానికి
ఏకమవుతున్న 'కలం' యోధుల
మనసు నిండా స్పందనల ఆవిరిపట్టి
గుండెలో నవభావాల మేఘాలు పుట్టి
మెదడులో ఆలోచన మెరుపులు మెరిసి
పదాలు ఉరుములై పేలి, చినుకులై రాలి
తెల్లని భూమిలో చెరగని నల్లని సాళ్ళుగా
మారాలి.
అప్పుడే...
వంచనలేని మరో ప్రంపంచం కోసం
సాగే మహాప్రస్థానం పునాదులైన
రేపటి నెత్తుటి చేతుల నుండి దూసుకెళ్ళే
పదునైన పోరుబాణాలుగా మారడానికి
మార్పు విత్తనాలు మొక్కలుగా మొలుస్తాయి!
చైతన్య రాగాలు వెలుగులుగా పొడుస్తాయి!!

- అనంగారి భాస్కర్

* పెండెం జగదీశ్వర్

ఓ రోజు సాయంత్రం కాసేపు మాట్లాడి వద్దామని మిత్రుడు ఆనంద్ ఇంటికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి ఆనంద్, అతని కొడుకు కిరణ్ బయటికెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు. ఎక్కడికని ప్రశ్నించాన్నేను. తామిద్దరం రోజూ సాయంకాలం పూట లైబ్రరీకి వెళ్ళి వస్తామని చెప్పాడు ఆనంద్. అంతేగాక తనతోపాటు కిరణ్‌ను కూడా లైబ్రరీలో సభ్యునిగా చేర్పించానని, పిల్లల పుస్తకాలను ఇంటికి తీసుకువచ్చి కిరణ్ చేత చదివిస్తానని చెప్పాడు. నాకు చాలా ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలిగింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు అటు తల్లిదండ్రుల మధ్య, ఇటు ఉపాధ్యాయుల మధ్య నలిగిపోతూ పాఠ్య పుస్తకాలే పరమావధిగా కాలాన్ని సాగిస్తున్నారు. ఇలాంటి వాతావరణంలో కూడా తమ పిల్లలు బాల సాహిత్యం కూడా చదవాలని, దాని ప్రాధాన్యతను గుర్తెరిగి ఉన్న ఆనంద్ లాంటి తల్లిదండ్రులు అక్కడక్కడా కనిపిస్తున్నందుకు మనం సంతోషించాలి.



మీ పిల్లల్ని లైబ్రరీకి తీసుకెళ్తున్నారా?

నేడు విద్యార్థులు చాలా వరకు బాల సాహిత్యానికి దూరమైపోతున్నారు. కాదు దూరం చేస్తున్నామని చెప్పాలి. తమ పిల్లలు జిల్లా ర్యాంకులు, స్టేట్ ర్యాంకులు సాధించాలనే ఆరాటంతో టీచర్లు, తల్లిదండ్రులు వారిని యంత్రాలుగా మార్చేస్తున్నారు. పాఠ్యపుస్తకాల్లోనే ప్రపంచమంతా దాగుంటుందన్న దురభిప్రాయంతో మరో పుస్తకాన్ని వాళ్ళ దరికి చేరనివ్వడం లేదు. పిల్లల చేతిలో ఓ కథల పుస్తకమో, బొమ్మల పుస్తకమో కనబడితే 'ఇక నువ్వు ఇవి చదివితే నీ చదువు తెల్లారినట్లే' అంటూ దాన్ని లాగేసుకుని వాళ్ళ ముందు స్కూలు పుస్తకాలు పడేసే అమ్మానాన్నలు, టీచర్లు మనలో ఎందరో కనిపిస్తారు. చదువుల్లో ఏర్పడిన పోటీ వాతావరణం మూలంగా తల్లిదండ్రుల్లో బాల సాహిత్య పఠనం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కొరవడుతోంది. వ్యక్తిగత ఖర్చులకు, విలాసాలకు వేలకు వేలు ఖర్చు పెడుతున్న మనం కనీసం పిల్లల కోసం ఒక మంచి పుస్తకం కొనలేని, చదివించలేని పరిస్థితి నెలకొన్నందుకు సిగ్గుపడాలి.

పిల్లలకు చక్కగా లోకజ్ఞానం కలగాలన్నా, సమాజం గురించి, జీవితం గురించి వాస్తవాలు తెలియాలన్నా, స్వయం కృషి, ఆత్మవిశ్వాసం, దేశభక్తి మొదలైన మంచి గుణాలు పెంపొందాలన్నా వాళ్ళ చేత తప్పనిసరిగా వాళ్ళకోసం ఉద్దేశించిన సాహిత్యాన్ని చదివించాలి. కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రం చాలనుకుంటే వాళ్ళు బావుల్లో కప్పలుగానే ఎదుగుతారు. అందువల్ల అందరు తల్లిదండ్రులూ తమ పిల్లలు తప్పనిసరిగా ఇతర పుస్తకాలు చదివి తీరాలన్న సత్యాన్ని గుర్తెరగాలి. బయటి పుస్తకాలు చదివితే స్కూలు చదువు దెబ్బతింటుందన్న ఆలోచనలను, అభిప్రాయాలను తమ నుండి తొలగించుకోవాలి. తాము దగ్గరుండి మంచి సాహిత్యాన్ని పిల్లల చేత చదివించాలి. పుట్టిన రోజు తదితర వేడుకల్లో పిల్లలకు పుస్తకాలను బహుమతులుగా ఇచ్చి పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి. వాళ్ళను లైబ్రరీలో సభ్యులుగా చేర్పించాలి.

ప్రతి గ్రంథాలయంలో పిల్లల కోసం ప్రత్యేకంగా విభాగాలున్నాయి. కథలు, పాటలు, నాటికలు, నవలలు, కామిక్స్, వ్యాసాలు మొదలైన ప్రక్రియలకు చెందిన అనేక పుస్తకాలు మనకు అందుబాటులో వుంటున్నాయి. ఇవేకాక పిల్లల కోసం అనేక మాసపత్రికలు వెలువడుతున్నాయి. ఇవి కూడా వారిలో మనోవికాసం పెంపొందడానికి ఎంతగానో సాయపడుతున్నాయి. కనీసం వారానికి రెండుసార్లయినా తల్లిదండ్రులు తమ పిల్లల్ని తమతో పాటు లైబ్రరీకి తీసుకువెళ్ళాలి. వాళ్ళకు పుస్తక పఠన ప్రాధాన్యతను తెలియజెప్పి చదివించాలి. వాళ్ళు కథ, పాట లాంటి ఏ ప్రక్రియను బాగా ఇష్టపడితే అందుకు సంబంధించిన పుస్తకాలను ఇంటికి తీసుకురావాలి. ఆదివారాల్లో ఎక్కువసేపు గ్రంథాలయంలో గడిపేలా ప్రోత్సహించాలి. పిల్లల చదువు వెనుకబడుతుందంటే వాళ్ళు చెడిపోతున్నారంటే అందుక్కారణం నేడు టెలివిజన్ ఛానళ్ళలో వస్తున్న చెడ్డ కార్యక్రమాలేనని గుర్తించాలి. టీవీ వల్ల ప్రయోజనాల కన్నా దుష్ఫలితాలే ఎక్కువ వున్నాయి. టీవీవల్ల పిల్లల్లో ఊహాశక్తి పెంపొందదు. కానీ పుస్తక పఠనం వల్ల ఆ బాధలేదు. నిర్ణీత వేళల్లో కొన్ని కార్యక్రమాలను మాత్రమే టీవీలో చూసేలా కట్టడి చేయాలి.

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో గ్రంథాలయాలను నిర్వహించడం తప్పనిసరి. ప్రయివేటు పాఠశాలలకు గుర్తింపు ఇచ్చే సందర్భంలో ప్రభుత్వం లైబ్రరీలో వారు సమకూర్చిన పుస్తకాల జాబితాను కూడా కోరుతుంది. నేడు చాలా పాఠశాలల్లో పుస్తకాలు దుమ్ము కొట్టుకుపోతున్నాయి. గ్రంథాలయాలు ఉండి కూడా నిరుపయోగమవుతున్నాయి. ప్రతిరోజూ పిల్లల చేత ఆ పుస్తకాలు చదివించాలనే ఆలోచన ఉపాధ్యాయులకు లేకపోవడం విచారకరం. ఉపాధ్యాయులు కూడా మూఢాభిప్రాయాలను వదిలి స్కూళ్ళలో బాలసాహిత్య పఠనాన్ని పెంచడానికి దోహదపడాలి. నేటి బాలలే రేపటి పౌరులు అన్న సత్యాన్ని గుర్తెరిగి వారి ఎదుగుదలకు కృషి చేయాలి. క్రమం తప్పకుండా గ్రంథాలయాలను నిర్వహించాలి. ప్రభుత్వం కూడా ప్రతి ఏటా రచయితల నుండి బాలసాహిత్యాన్ని కొనుగోలు చేసి గ్రంథాలయాలకు అందిస్తుంది. దీనిని మనం వినియోగించుకుని మన పిల్లల భవితకు తోడ్పడాలి.

* పి.ఎం.సుందరరావు

కళ వ్యర్థం కాదు

'ఒరే రమేష్! నీకు ఎన్నిసార్లు చెప్పాను. ఆ మిమిక్రీ నేర్చుకోవటానికి వెళ్లొద్దని. ఇంకోసారి వెళ్లావంటే, చిన్నవాడివని కూడా చూడకుండా చితక బాదుతాను' అని కోపగించుకున్నాడు తండ్రి ప్రకాశం.

రమేష్ ఏం మాట్లాడకుండా మౌనంగా వుండిపోయాడు. మిమిక్రీ నేర్చుకొని అందులో తనకొక గుర్తింపు తెచ్చుకోవాలన్నది రమేష్ కోరిక. వాడు పదవ తరగతి చదువుతున్నాడు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా స్కూలుకు వెళుతుంటాడు. పరీక్షలన్నింటిలో మంచిమార్కులు వస్తుంటాయి. అందుకే స్కూల్లో టీచర్లందరికు రమేష్ అంటే చాలా ఇష్టం.



ఖాళీసమయాల్లో మిమిక్రీ నేర్చుకోవాలనే ఉత్సాహం కలిగింది రమేష్‌కి. ఆ విషయం తండ్రికి చెబితే ఆయన మండిపడ్డాడు. 'అందులో పడి చదువును అశ్రద్ధచేస్తావు. ఇది నాకెంత మాత్రం నచ్చదు' అని మందలించాడు. చదువుకు ఆటంకం కలగకుండా నేర్చుకొంటానని బ్రతిమిలాడినా వినలేదు.

రమేష్ తన తల్లి జయంతిద్వారా చెప్పించినా, ప్రకాశం వినలేదు. తల్లి ప్రోత్సాహంతో తండ్రికి తెలియకుండా మిమిక్రీ నేర్చుకోసాగాడు.

కొంతకాలం తర్వాత పక్క రాష్ట్రంలో వరదలు వచ్చి, అక్కడి ప్రజలు అనేక విధాలుగా నష్టపోయారు. వారికి ఆర్థిక, వస్తు సహాయం చేయటానికి అనేక స్వచ్ఛందసంస్థలు ముందుకు వచ్చాయి. రమేష్ చదువుకుంటున్న స్కూలు హెడ్మాస్టరుగారు కూడా, ఆ స్కూలు విద్యార్థులు, టీచర్ల నుండి కొంత డబ్బు సేకరించి వరద బాధితులకు పంపాలనే నిర్ణయం తీసుకున్నారు.

రమేష్ తన అభిప్రాయాన్ని హెడ్మాస్టరు గారికి చెప్పి, అందుకు సహకరించమన్నాడు. అది మంచి పని కావటంతో ఆయన ఒప్పుకున్నారు. హెడ్మాస్టరుగారి సహాయంతో ఆ స్కూలులోనే కాకుండా, ఆ జిల్లాలోని అన్ని స్కూళ్ళలో మిమిక్రీ ప్రదర్శనలిచ్చి డబ్బు పోగుచేసి వరద బాధితులకు పంపాడు.

ఈ విషయం తెలుసుకున్న కలెక్టరుగారు ఒక ప్రత్యేక సభ ఏర్పాటు చేసి, అందులో రమేష్ చేసిన మంచిపనిని, మిమిక్రీ కళను ప్రశంసించి బహుమతి అందజేశారు. ఆ సభలో జిల్లా కలెక్టరుగారితోపాటు అధికారులు, ఇతర పెద్దలు.... తన కొడుకును పొగుడుతుంటే ప్రకాశం కళ్లనుండి ఆనందభాష్పాలు రాలాయి. తను నిరుత్సాహపరిచినా పట్టుదలతో మిమిక్రీకళను అభ్యసించి, పేరు సంపాదించుకున్న రమేష్‌ను ఆలింగనం చేసుకున్నాడు. అప్పటి నుంచి కుమారుడ్ని ప్రోత్సహించసాగాడు. ●



క్విజ్-77

1. సముద్రగుప్తుని చరిత్రకారులు ఇలా పిలుస్తారు?
   ఎ. ఇండియన్ నెపోలియన్ బి. నెపోలియన్
2. లోక్‌సభ కాలపరిమితి ఎంత?
   ఎ.4 సంవత్సరాలు బి. 5 సంవత్సరాలు
3. అక్టోబర్ 2వ తేదీ ప్రాముఖ్యత ఏమిటి?
   ఎ.గాంధీ జయంతి బి. గాంధీ వర్ధంతి
4. 'మై ట్రూత్' రచయిత ఎవరు?
   ఎ. ఇందిరాగాంధి బి. నెహ్రూ
5. సిక్కిం రాజధాని ?
   ఎ. గాంగ్‌టక్ బి. అగర్తల
6. ప్రపంచంలో అతి ఎత్తయిన ప్రదేశం?
   ఎ.టిబెట్ బి.జెడ్డా
7. ఇమ్యూనిటీ అంటే...?
   ఎ.రోగనిరోధక శక్తి బి.రోగకారక శక్తి
8. చేపలు దేనిని గ్రహించి శ్వాసిస్తాయి?
   ఎ.ఆక్సిజన్
   బి.కార్బన్‌డై ఆక్సైడ్
9. అణువును విభజించిన ఏర్పడునది?
   ఎ. పరమాణువు
   బి. పదార్థము
10. ఈ ఫొటోలోని మస్కట్ పేరేంటి?
   ఎ. షేరూ
   బి. అప్పు

రంగులు అద్దుతారా!

చిన్నారి చిత్రకారులు



వై.గణేష్, 4వ తరగతి,
ఆంధ్ర పబ్లిక్‌స్కూల్,
విశాఖ.

కె.తన్మయ, 1వ తరగతి,
అరండల్‌పేట, గుంటూరు.

ఎం.హారిణి, 1వతరగతి,
వర్డ్ అండ్ డీడ్ స్కూల్,
వనస్థలిపురం, హైదరాబాదు.



యం.డి. జాఫార్,
4వ తరగతి,
కేంద్రప్రాథమిక పాఠశాల,
చింతల్‌ఘాట్,
మెదక్.

ఇలా చెయ్యండి చూద్దాం!



మేజిక్ మేజిక్!

హాయ్! నా దగ్గర మంత్రించిన నీళ్లు వున్నాయిగా. వాటిని ఒక గాజు గ్లాసులో పోస్తే చాలు. అవి వాటంతట అవే బయటికొచ్చేస్తాయి. కావాలంటే చూడండి. ఇదిగో గాజు గ్లాసు. ఇవిగో మంత్రించిన నీళ్లు. గ్లాసులో పోశానుగదా. ఇదిగో ఈ వక్రనాళం అందులో వుంచాను. అంతే నీళ్లు చూడండి. మనం ఏం చెయ్యకుండానే వాటంతట అవే బొళబొళా బయటికొచ్చేస్తున్నాయి. భలే విచిత్రంగా వుందికదూ. మరేంటనుకున్నారు. మనం మంత్రం వేశాక ఇక తిరుగు వుండదు. అంతే.

ఏంటి అలా చూస్తున్నారు. ఆ మంత్రించిన నీళ్లు మీక్కూడా కావాలా? అమ్మో! ఆశ!! 'పోనీ ఆ మంత్రం ఏంటో చెప్పండి. మేంకూడా ఓ గ్లాసు నిండా నీళ్లు తీసుకుని మంత్రిస్తాం' అంటున్నారా? అబ్బా! దోశ!! మీ అందరికీ చెప్పేస్తే ఇంక నా గొప్పేం వుంటుంది. నేను చెప్పనుగాక చెప్పను. కానీ...కొందరు చిన్నారులు అలా జాలిగా చూస్తుంటే నేను చెప్పకుండా వుండలేకపోతున్నాను.

ఏం లేదర్రా...! ఇక్కడ మంత్రం లేదు. మాయ లేదు. మేజిక్ అంతా వక్రనాళంలోనే వుంది. దీన్ని మీరు కూడా తయారు చేయవచ్చు. ఒక గాజు గొట్టం తీసుకుని కొవ్వొత్తి దగ్గర వేడి చేసి పటంలో చూపించినట్టు వంచవచ్చు. గొట్టం మళ్లీ చల్లబడగానే పటంలోలా నీటిలో వుంచాలి. అప్పుడు ఆ వంకర గొట్టం వెంటనే పనిచెయ్యడం మొదలుపెడుతుంది. నీళ్లు బయటకు వస్తాయి.

దీనికి కారణం ఏంటంటే...నీటికి తన మట్టాన్ని చేరుకునే గుణం వుంది. అందువల్ల గొట్టంలోని 'ఎ' బిందువు నీటిలో మునిగినప్పుడు నీరు గొట్టం ద్వారా 'బి' అనే బిందువు వరకూ ప్రవహిస్తుంది. జడతా ధర్మం కారణంగా నీరు పైకి పోయి 'సి' అనే బిందువును దాటి పైకి వెళ్లి నిర్విరామంగా బయటకు ప్రవహిస్తుంది. అందుకే నీళ్లు బయటకు వచ్చేస్తాయి.

క్విజ్ 76 జవాబులు

1.మార్కొని 2. లూయిస్ కారల్ 3. ఆసుపత్రి లేక వైద్య పరికరములు 4. ఫ్రాన్స్ 5. పిండిపదార్థము 6. ఉష్ణశక్తి 7. చిక్కుడు గింజ ఆకారము 8. ఆక్సిజన్ 9. గవర్నర్ 10. మీరానాయర్

క్విజ్ 75కు సరైన సమాధానాలు రాసిన వారు :

ఎస్.నాగేంద్రవిశ్వనాథ్, 9వ తరగతి, మునిసిపల్ బోయ్స్ హై స్కూల్, కాకినాడ. **పి.ఉపేంద్ర,** 6వ తరగతి, రాచపూడి, ప్రకాశం. **బి.వామనరావు,** 10వ తరగతి, చిన్నమండలవీధి, శ్రీకాకుళం. **కె.రాజేష్,** 5వ తరగతి, **బి.బాలసుబ్రమణ్యం,** 10వ తరగతి, సనత్‌నగర్, విశాఖపట్నం. **కె.కవిత,** 8వ తరగతి, గవరపాలెం, విశాఖ. **కె.కాదంబరి,** 9వ తరగతి, దువ్వలి, ప్రకాశం.

కలం స్నేహం

పేరు: ఎం.హర్ష
వయసు : 8 సం॥
చదువు : 3వతరగతి
హాబీలు : క్యారమ్స్ ఆడడం, కార్టూన్ చానల్ చూడడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా : ఎం.హర్ష, సన్నాఫ్ ఎం.గణేష్, పి.నెం.51, బిడిఎల్ కాలనీ, వనస్థలిపురం, హైదరాబాదు-72

పేరు: యం.డి.ఇమ్రాన్ ఉద్దీన్ సిద్దిఖి,
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : బొమ్మలు వేయడం, క్రికెట్ ఆడడం, జికె పుస్తకాలు చదవడం, లైబ్రేరీకి వెళ్లడం.
పూర్తి చిరునామా : యం.డి.ఇమ్రాన్ ఉద్దీన్ సిద్దిఖి, 8వ తరగతి, డఫాడిల్స్ స్కూల్, పరిగి-501 501.

గొంతెమ్మ కోరిక

అక్బర్‌పాదుషాగారి బావమరిది దిలావర్‌ఖాన్. ఖాన్‌గారికి ఎప్పటినుంచో మంత్రి కావాలన్న కోరిక వుంది. బీర్బల్‌ను తగ్గించి తనకు మంత్రి పదవి ఇమ్మని అడిగాడు చక్రవర్తిని. అతని గొంతెమ్మకోరిక చూసి అక్బర్ నవ్వుకున్నాడు. అయినా బావమరిదికదా. పదిమందిలో పరిహసిస్తే మరెన్నడూ అలా అడగడనుకున్నాడాయన.

అందుకని అక్బర్ ఆయనవైపు తిరిగి 'దిలావర్! మంత్రి పదవి అంటే ఏంటనుకున్నావు? పదిమందిని మెప్పించే తెలివితేటలు, చాతుర్యం, సమయస్ఫూర్తి, రాజకీయ తంత్రమూ, ఎదుటివారి మనసులోని కోరికలను తెలుసుకోగల శక్తి, వాటిని ఎలా తీర్చాలన్న నేర్పు వుండాలి. అవన్నీ నీకు వున్నాయో లేదో పరీక్షించాలి. రేపు సభలో నిన్నొక ప్రశ్న వేస్తాను. దానికి సరైన జవాబు చెప్తే మంత్రిపదవి ఇస్తాను. చెప్పలేకపోయావో మరి ఈ జన్మలో అటువంటి కోరిక మరోసారి కోరకూడదు. ఇంట్లోనే పడివుండు' అని హెచ్చరించాడు.

మరునాడు దర్బారులో అక్బరు చక్రవర్తి దిలావర్‌ఖాన్‌వైపు తిరిగి 'దిలావర్! ఈ సభలో ఇంత మంది వున్నారుకదా. వీరు మనస్సులో నా గురించి ఏమనుకుంటున్నారో చెప్పగలవా?' అని అడిగారు.

అతను ఆ ప్రశ్న విని నిర్ఘాంతపోయాడు. 'ఇదేం ప్రశ్న. అసలు దీనికి ఎవరైనా సమాధానం చెప్పగలుగుతారా?' అని అడిగాడు.

దానికి అక్బర్ నవ్వి 'నీకు తెలియక పోవచ్చు. కానీ విజ్ఞత వున్నవాడు సమాధానం చెప్పగలడు' అని బీర్బల్ వైపు తిరిగి 'పండిట్‌జీ! మీరు నా ప్రశ్నకు సమాధానం చెప్పగలరా?' అన్నాడు.

దానికి బీర్బల్ నవ్వుతూ 'ప్రభూ! ఇది చాలా సులభమైన ప్రశ్న. సభాసదులందరూ తమ పాలనలో ప్రజలంతా సుఖంగా వుండాలని కోరుకుంటున్నారు. అంతేకాదు పాదుషావారు చిరకాలము సర్వసౌభాగ్యాలతో తులతూగాలని ఆశిస్తున్నారు' అన్నాడు.

అందరూ సంతోషంతో చప్పట్లు చరిచారు. దిలావర్ సిగ్గుతో తలదించుకున్నాడు.

పాదుషా ఆనందంతో బీర్బల్‌ను ఘనంగా సత్కరించారు.

డ్యాములు కట్టే జంతువు

బీవర్ అనే జంతువు డ్యాములు కడుతుంది తెలుసా. ఈ బీవర్లు చెట్లను కొరికి వాటిని నీటిలో వడవేసి ఆనకట్టలు కడతాయి. ఇవి నీటిలో నివసిస్తాయి. వీటి పళ్లు చాలా పదునుగా వుంటాయి. గట్టి చెట్లను కూడా ఇట్టే కొరికి పడేస్తాయి. ఇవి నీటి లోపల సుమారు కిలోమీటరు లోతు వరకు వెళ్లి దాదాపు 15 నిముషాలపాటు ఊపిరి పీల్చకుండా వుండగలుగుతాయి.

*రుక్మిణి

"యాద్గిరన్నా.... ఊర్లో ఒక్కడూ కనపడ్డం లేదు... గురివిగాడు పత్తా లేదు - జాకోబు... ఎంకటి... మైసయ్య... అరె... అసలు ఈ గుంపు గుంపంతా యాడికి పోయింగ్రో..." వుస్సురని గాలి ఎగబీకి వదులుతూ జక్కులోడు చప్టా మీద కూలబడంగానే, యాద్గిరి వింతగా చూశాడు. "అదేందిరా... రోజూ కనపడడానికి వాళ్ళేమైనా ఆఫీసర్లా... మంత్రులా... ఎవడి పనిమీద వాడు ఎక్కడెక్కడికో పోయుంటారు. ఒరే... అయినా అంతమంది 'యాడికి పోయింగ్రో' అన్న మతలబు నీకెందుకురా?" బీడీ దమ్ము పీకి దూరంగా విసిరి కొడుతూ యాద్గిరి చికాగ్గా అన్నాడు.

రేస్ ట్రాక్ - యాస్ టాక్

"నాకేం అక్కర్లేదంటే కుదరదు. నాగ్గాకపోయినా వాండ్ల పెండ్లాలకైతే మతలబు అక్కరేగదా! వాండ్లు 'లబోదిబో'మని ఒకటే గోలకు తగులుకున్నరాయె - తగులుకుంటె ఫర్వాలేదు - నేనేదో కంపూటరు మాస్టర్నీ... లాప్‌టాపులు లటుకు లటుకు నాక్కే వాడ్ననీ... అందరి ఇన్ఫర్మేషను మన చెంద్రబాబుగారి దగ్గిర పడున్నట్లు నా దగ్గర మూలుగుతుందనీ వాళ్ళ అనుమానం.. అదుగో.. వాండ్లే వస్తున్నారు. ఓరి నాయనో... ఏదోవిని... ఏదో చెప్పు...!"

జక్కులోడు మాట ముగించేయుగా యాద్గిరి నిర్ఘాంత పడిపోయాడు. ఎందుకంటే గుంపులుగా గురివిగాడు దగ్గర్నుండి... మైసయ్యల వరకూ వాళ్ళ భార్యలు లబోదిబోమని రావిచెట్టుకాడికి చేరనే చేరినారు గదా...!

"ఏందె అక్కా... ఏందాగోల... అరె... ఆ ఏడుపులేందే... ఓర్ని... జర ఏడుపులాపి సంగతేందో మిడకరాండ్రి...!" యాద్గిరి మటమటలాడి గద్దించడంతో వాళ్ళు కాస్త స్థిమిత పడిపోయినారు.

"గురివిగాడు... ఈ గుంపంతా కలిసి నాలుగు రోజుల్నుండే ఎక్కడికి పోయింగ్రో తెలవటంలే... చెరువులు... కాల్వలు అన్నీ వెతికినం... పోరడు చుట్టు పక్కల వూర్లకు ఫోన్లు కొట్టిండు - ఎంకటన్న... మైసయ్య... యాడపోయింగ్రో..!" వాళ్ళ రోదన రోగానికి తగులుకోడంతో... దూరంగా చప్పిడి తప్పిడిగా అడుగులేసుకుంటూ వస్తున్న ఆకారం కనిపించింది. ఎవడువాడు? కాస్తంత దగ్గరకు వచ్చి పడంగానే అక్కడున్న అందరూ నోళ్ళు... గుడ్లు అప్పగించి చూడాల్సి వచ్చింది. ఎందుకంటే వాడు జాకోబు అనబడే యాకోబు. అయితే మరి ఆ వాలకం ఏంది? ఎక్కడైనా దారిదోపిడి దొంగలు మీద బడ్డారా ? నకిలీ నక్సలైట్లు నరాలిరగబాదినారా? అసలు ఆ అవతారం ఏంది? ఒంటిమీద పూరా బుట్టల్లేకుండా... సుద్దమొద్దులా కటిక డ్రాయరు ముక్కేసుకుని అట్లా బజార్లలో తిరగడం... మతలబేంది? ఈ మూడ్నాలుగు రోజులు ఇల్లు వదిలిపెట్టి ఎక్కడ రాజ్యాలు ఏలడానికి పోయండట! జాకబు భార్యామణి వాడిమీదకు గయ్యిమని ఎగబడింది. వాడు లేని ఓపిక తెచ్చుకుని 'కయ్యి'మని ఓ కసురు కసిరి చప్టా మీద ముందు కూలబడి, ఆనక తీరుబాటుగా వెల్లకిలా విశ్రమించిన వాడాయెను. యాద్గిరి పండ్లు పటపట కొరికాడు.

"ఏందిర యాకోబు... ఏందీ అవతారం... అవతల నీ పెండ్లామేమో పెనిమిటి కనబడట్లేదని కంగాళీ చేసి కదం తొక్కుతుండెగదా... అరె...!"

"పులీ... మేకా...!" యాకోబు సన్నగా మూలిగాడు. జక్కులోడు ఝుడుసుకుని నివ్వెరపోయాడు.

"అరె... అసలీ అవతారం ఏందిర? నీ ప్యాంటూ.. సారల చొక్కా.. ముతకబనీనూ... అవేం లేకుండా గిదేం తిరుగుడూ...' ఇదేం ఫ్యాషనూ?" యాద్గిరి మెల్లగా వాడి డొక్కలో ఓ పోటు పొడిచాడు.

"పులీ... మేకా....!" వాడు ఓ నీలుగు నీలిగాడు. యాద్గిరికి ఒళ్ళు మండిపోయి ఓ పావుగంట తిట్టాడు. వాడి భార్య మాత్రం పాంటూ.. చొక్కా లేకున్నా శాల్తీ దక్కినందుకు ఆనందంతో పొంగిపోతూ ఆలకిస్తూ నిలబడింది.

"అరె... జరజరుగురా.. అవతల పులి... ఇక్కడ మేకపోతు... జర తప్పుకో..." యాద్గిరి జర జరగ్గానే జక్కులోడు వాడి వీప్మీద ఓ పిడిగుద్దు గుద్దగానే జోకోబు తల విదిలించాడు.

"యహె... అవతల గార్లలో డేరాలు గట్టి 'పులిజూదం' ఆటలు పెట్టింద్రు... అబ్బో... ఒకటే జనం.. విరగబడిపోతున్నారు - ఒక చొక్కా పీకి పడేసి ఆటలోకి జొరబడి గెలిచినామంటే మరో చొక్కా.. బనీను మనకు వచ్చేస్తాయి - ప్యాంటుకైతే గోచీ.. చొక్కా బనీను ఫ్రీ.. అబ్బో... గప్పుమనే లైట్లు... మధ్యమధ్యన పాటలు... ఒకవైపు డాన్సులు... గివన్నీ ఫ్రీగా జూసుకుంటు మన కష్టాలన్నిటినీ చిటికెలో మర్చిపోవచ్చు.... పులీ... మేకా!" జాకోబు పరవశంగా చెప్పుకుపోతుంటే వాడి పెండ్లామేమో వెక్కిళ్ళకు తగులుకుంది. మిగిలిన ఆడవాళ్ళందరూ ఎగబడ్డారు. "అయితే మరి మన ముసలి గురివిగాడు.. వెంకటి... వాళ్ళందరు... చొక్కాలు.... బనీన్లు అన్నీ 'ఫ్రీ'గా వాండ్లకు అప్పజెప్పి దినవెులల్తో దిగబడి పోతారా ఏంది?'' అని హడలిపోయి ఏడుపులకు తగులుకున్నారు.

"యహె... వాండ్లు నాతోబాటె గార్ల దనక వచ్చి అట్నుంచి అటే డోర్నకల్‌కు పోయినారు గద!" జాకోబు చీదుతూ అన్నాడు.

"డోర్నకల్‌లో ఏందిగదీసిందీ... అక్కడ 'కుక్కా - తోడేలు' గుడారాలు వెలిసినయా... అచ్చన గిల్లల ఆటలా... తొక్కుడు బిళ్ళలా...!" జక్కులోడు మండిపడుతూ అన్నాడు.

"గాడిదలు.. అబ్బో....!" జాకోబు నడి వీప్మీద మరో పిడిగుద్దు యాద్గిరిది పడింది - అపుడే దూరం నుండి హుషారు చేసుకుంటూ ఎంకటిగాడు వూడిపడి ఓ ఈలేసి ఊదరకు తగులుకున్నాడు.

"మనూర్లె వచ్చే ఆదివారం నుండి గాడిదల రేసులు... వూరి బయట తాటివనంలో - పందాలు కాసే వారికి పసందైన బహుమానాలు.. సూడముచ్చటైన గాడిదలు... కంచర గాడిదలు"

అక్కడున్న ఆడవాళ్ళందరూ హడలి పోయారు. జక్కులోడికి బుర్ర తిరిగి పోయింది. "గాడిద లేందిరా గాడిదా! పిచ్చిగాని పట్టిందా?" అని అరిచాడు.

"కాదసె.. మనూర్లె జనాలకు ఎటూ పొద్దు పోడం లేదు - పనుల్లేవు - అందుకని అందరికీ బాగా లాభాలు కలిసొచ్చి... అందరు మగవాండ్లు పచ్చగా వర్ధిల్లిపోవాల్నని గాడిదలను మాట్లాడినం.. వాటికి మనూర్లె రేసులు పెడతం! ఫస్టు వచ్చిన గాడిదకు ప్రైజు... సుట్టుపక్కల వూర్లె నుండి గుంపులు గుంపులుగా జనం పోగయితరు. పై పందాలకు పంచెలిప్పి పందాలు... కాసుకోవచ్చు... జనాలకు కావలసినంత అభివృద్ధి... ఒరే జక్కులోడా వేలమందికి వుపాధి.. నువ్వక్కడ పాన్ దుకాణం పెట్టుకుంటే బెల్టు బ్రాండీ లాగించెయ్యవచ్చు - జనాలకు బోలెడన్ని సంపాదనకు అవకాశాలు.. అసలు పని పాటల్లేని వాళ్ళకోసమే ఈ అద్భుతమైన రేసుల పథకం...

ఈసారి యాద్గిరికి బుర్రంతా తిరిగి పోయింది! ●

కథలూ కవిత్వం రాయడం ఆషామాషీ వ్యవహారం కానేకాదు! అదొక ఆర్టు? సృష్టికి ప్రతి సృష్టి. విశ్వామిత్ర మార్కు కృషి. బ్రహ్మగారు సకల జీవరాసుల్ని సృష్టించిన విధంగానే - కవిగారు కూడా కొన్ని గొడవలూ కొన్ని కేరెక్టర్లూ పేజీల మీదకెక్కిస్తుంటారు. అంచేత బ్రహ్మగారి చేతి వాటం ఎంతో కొంత కవిగారిక్కూడా అలవాటు పడుతుంది. కవిగారు కూడా ఒక జీవితాన్ని పేజీల్లో చెక్కుతారు! అది విషాదం కావచ్చు. వినోదం కావచ్చు. రెండూ ఉండచ్చు. కళ్ళక్కట్టినట్టు కథ నడిపిస్తుంటారు. కాగితమ్మీద ఉండిపోతే రచన అవుతుంది. వెండితెరకెక్కితే సినీమా అవుతుంది. అంతమాత్రాన చేతికేమొస్తే అది కాగితమ్మీద పేర్చేసుకుంటూ పోతే అది కథ కాలేదు. దానికో శిల్పముంది! అందుకో వరసుంది! ఆ ప్రకారమే కథ చెప్పాలి. మొట్టమొదట ఒకానొక థాట్ కవిగారి మెదడ్ని కుదుతుంది. కుట్టి కుదుపుతుంది!

మాయదారి నవల!

ఆ కుదుపుకు మొదలూ తుదీ ఉండదు. ఆ రెండూలేని పద్ధతిలో చీమాదోమా మాదిరి మెదడ్ని చిటుక్కు చిటుక్కుమని కుదుతూనే ఉంటుంది. కుట్టి కుదుపుతూనే ఉంటుంది. బ్రహ్మ చేతిలో మట్టిముద్ద మాదిరి - మూడ్ బావుంటే ఆ కుదుపు అపరంజి బొమ్మవుతుంది. చిరాకు పడిపోతుంటే అదే కుదుపు దిష్టిబొమ్మగా తయారవుతుంది. రచయితగారి మూడూగ్రటాలు దివ్యంగా ఉంటే అందమైన కథ హల్లో అంటుంది. వారికి హీటెక్కిపోతున్నప్పుడు - చెత్తార్ చెద్గారేర్ టైపులో కొన్ని పిచ్చిపిచ్చి వాక్యాలు కథని నడిపిస్తాయి. ఏతావాతా కవిగారు రాసే కథ రమ్యంగా నడవాలంటే - వారి మెదడు దివ్యంగా ఉండాలి. రచయిత మెదడు చాకులాగా పని చేయాలంటే వారి ఇంటి పరిస్థితులు ప్రశాంతంగా ఉండాలి! అందుకు వారి అర్ధాంగి సహకారం అపారంగా లభించాలి!

ఇల్లు ప్రశాంతంగా లేకపోతే రచయిత మెదడు పని చెయ్యదు. అతని రాతకోతల్లో 'సొగసు' దెబ్బ తింటుంది. ఉదహరిస్తాను. గోపాలం రాధను గాఢంగా ప్రేమిస్తున్నాడు - అనే వాక్యం రాసింతర్వాత సదరు రచయితకు కాఫీ తాగాలనిపిస్తుంది. అంచేత కాఫీ అని అరుస్తాడు. ఆ ఆర్తనాదం విన్నప్పుడు అతని అర్ధాంగి అద్భుతమైన కాఫీ యిస్తే - మిగతా వాక్యాలు కూడా అందంగానే రాయగలడు. కాఫీ బదులు కషాయమిచ్చినా.. పానకమిచ్చినా.. కాఫీ పొడి నిండుకుందని సమాచారం అందించినా.. అంతే సంగతులు! రాస్తున్న కథ తాలూకు అందమైన నడక అకస్మాత్తుగా మారిపోతుంది. ఆ వరస ఇట్లా అఘోరిస్తుంది. గోపాలం రాధకిచ్చిన కాఫీలో విషముంది. ఆ సంగతి తెలీని రాధ కాఫీ తాగి కన్ను మూస్తుందని కథకు చుక్క పెడతాడు. అంటే ఏమిటి? కథ రాసే రచయితకంటే - అతనికి సక్రమంగా సేవలు చేసే అతని ఇల్లాలి పాత్ర ప్రధానమని తెలీడం లేదూ?

భక్త పోతన మహాభక్తుడే కావచ్చు. మహాకవే కావచ్చు. ఆశువుగా కమ్మటి కవిత్వం చెప్పగల దిట్ట కావచ్చు. ఆ మహాకవి చేతి నుంచి మణిమాణిక్యాల్లాంటి పద్యాలు పుట్టొచ్చు. నిజమే! వేళకి ఆయన అవసరాలు గుర్తించి తగు సేవలు చేసేవారి అర్ధాంగి వారికి నీడలా ఉంది గనక - భాగవతం అంత అందంగా రాసి తరించేడు ఆ మహానుభావుడు! ఆ ఇల్లాలు ఏ మాత్రం రగడ చేసినా భాగవతం ఒక భాగోతమై ఉండేది. ఆ రచన మధ్యలో ఆగిపోయి ఉండేది. రాసేది నేనైనా రాయించేవాడు శ్రీరాముడు అనే ఆ భక్తుడి స్టేటుమెంటుకి కాలం చెల్లిపోయేది! అంచేత ఆ గ్రంథాన్ని న్యాయ ప్రకారం ఇల్లాలికే అంకితం చేయాలి! ఈ నగ్న సత్యాన్ని ఆ మహాకవి గమనించి కూడా నిర్లక్ష్యం చేసేడో లేక మగమారాజు బ్రాండు టెక్నిక్కు ప్రయోగించేడో తెలీదు. సదరు అంత గొప్ప గ్రంథాన్నీ శ్రీరాముల వారికి మాత్రమే అంకితం చేస్తానని ప్రతిజ్ఞ చేసి - భార్యామణిని పూర్తిగా మరిచిపోయేరు!

భర్త చేసిన పని పుణ్య కార్యం గనక - ఆ పుణ్యంలో తనకీ వంతు ఉంటుంది గనక - అంకితం విషయంలో ఆవిడ అడ్డం పడలేదు. వదిలేయండి. ఒక్క పోతన మాత్రమే కాదు. ఆదికాలం నుంచీ కవులందరూ ఇదే తంతులో కవిత్వాలు రాసేరు. వారు రాసిన మహామహా గ్రంథాలూ, గొప్పగొప్ప కావ్యాలూ ప్రభువులకో, చక్రవర్తులకో అంకితమిచ్చిన ఆదర్శ కవుల సంఖ్య బహు తక్కువ! బహుశా బొత్తిగా లేరేమో కూడా! ఇంచుమించు ఇప్పటి పరిస్థితి కూడా అట్లాగే ఉంది. అరువు బేరమ్మీద వెచ్చాలిచ్చిన షావుకారుగారికి - మా వారి తోటి రచయిత వరసగా నాలుగు పుస్తకాలు అంకితమిచ్చేసేడు. మా వారు కూడా అంకితం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటుంటారు!

చేబదుళ్ళిచ్చి మరిచి పోయే ఫ్రెండ్సుకీ, సన్మానాలు చేసే పెద్దలకీ మాత్రమే మా వారు తన పుస్తకాలను అంకితమిస్తుంటారు! అంతేగాని - శ్రీవారు రచనా వ్యాసంగంలో వళ్ళు తెలీకుండా ఉన్న సమయంలో వారి అవసరాలను జాగ్రత్తగా చూసుకునే నన్ను పూర్తిగా మరిచిపోయేరు! అడక్కూడదనుకుంటూనే మొన్నామధ్య అడిగేసేను - నాకో పుస్తకం అంకితమిస్తే సంతోషిస్తానని! ఇవ్వనని అనలేదు శ్రీవారు. ఆ మాటంటే ముందుముందు వారి అవసరాలకు అంతరాయం కలుగుతుందనే భయం కాబోలు! అట్లాగని 'అంతకంటేనా' అని కూడా అనలేదు. ఒక తిరకాసు పెట్టేరు. వెయ్యి పడగలు లెవెల్లో రెండు వేల పేజీల నవల రాసి - ఆ నవల నాకు అంకితమిస్తానన్నారు. అంత హామీ విని గొప్ప ఆనందపడి పోయేను. ఇప్పుడు వారు అ, ఆలు రాస్తున్నా - అది రెండు వేల పేజీల నవలే కాబోలని అనుకుంటూ నా సేవల సైజు కూడా పెంచేసేను! అంకితమంటే అవతల్నుంచి అంతో ఇంతో గిట్టుబాటవ్వాలే గాని - అర్ధాంగులక్కూడా అంకితమిస్తే అడుక్కు తినాలనేది మగమారాజుల సిద్ధాంతం కాబోలు! అందుకే - నవలెప్పుడు పూర్తవుతుందని అడిగినప్పుడల్లా అదుగో, ఇదుగో అంటూ వాయిదాలు వేస్తున్నారు. ఎప్పుడు పూర్తవుతుందో ఆ మాయదారి నవల! ●

❋ నేతాజీ కుమారమంగళం



చారిత్రక దుర్గం చంద్రగిరి

గతించిన ప్రాచీన జీవన శైలికి, రాజరికాలకు, రాజపోషకులకు నెలవుగా వుండి భావి తరాలకు చరిత్ర అంటే ఇలా వుండేది. అప్పట్లో ఇక్కడ రాజులు ఇలా పరిపాలించే వారు అని చెప్పటానికి ప్రత్యక్షసాక్ష్యాలుగా ఉపయోగపడే పురాతన చారిత్రక కట్టడాలలో ఒకటి చంద్రగిరిలోని దుర్గం. చంద్రగిరి దుర్గం శౌర్యానికి గీచిన గిరి మాత్రమే కాదు చరిత్రనే తారుమారు చేసిన దుర్గం. ప్రపంచ చరిత్రలో చిరస్మరణీయమైన స్థానం సంపాదించుకున్న కోట ఇది.

మద్రాసు కోట సెయింట్‌జార్జి నిర్మాణానికి స్థలాన్ని, అనుమతిని ఈస్టుఇండియా కంపెనీకి ఇచ్చేందుకు క్రీస్తుశకం 1639, ఆగస్టు 22న చంద్రగిరి దుర్గంలోనే ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం అప్పట్లో రెండవ రంగరాయలు, ఈస్టుఇండియా కంపెనీ ప్రతినిధులకు మధ్య జరిగింది. శ్రీకాళహస్తి సామంతరాజు(జమీందారు) వెంకటాద్రి బ్రిటీషువారికి మన దేశంలో కాలుమోపేందుకు, చెన్నపట్నం (మద్రాసు)లో అడుగుపెట్టేందుకు అనుమతించారు. ఈస్టు ఇండియా ఒప్పందానికి సాక్ష్యంగా మిగిలినదే నేటి చంద్రగిరి దుర్గంలోని రాజమహల్. విజయనగర రాజుల కాలంలో మూడవ రాజధానిగా ఒక వెలుగు వెలిగి ఆ తరువాత నిర్వహణ లేక పాడుపడిన స్థితిలో ఉన్న చంద్రగిరి కోటకు మళ్ళీ 1997 నుంచి మంచి రోజులు వచ్చాయి. పరావస్తు శాఖ అరకొర నిధులతో కోటను, చుట్టుపక్కల ఉన్న ప్రాచీన కట్టడాలను కాపాడే ప్రయత్నం చేయగా, రాష్ట్ర ప్రభుత్వం చంద్రగిరిపోర్టులో సౌండ్ అండ్ లైటింగ్ ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టి పర్యాటకులను ఆకర్షిస్తున్నది. విజయనగర యాదవరాయల వంశస్థుల పాలనలో శత్రు దుర్భేద్యంగా యుద్ధాలను దృష్టిలో ఉంచుకుని చంద్రగిరి కోటను నిర్మించారు. ప్రాచీన జీవన విధానంలోని కళలు, చిత్రలేఖనం, సంస్కృతి, రాజకీయాలు, పరిపాలనావిధానాలు గూర్చి తెలుసుకోవటానికి చిత్తూరు జిల్లాలో ప్రజలకు అందుబాటులో ఉన్న అత్యంత ప్రాచీన కట్టడం ఇదే. దాదాపు 1000 సంవత్సరాల చరిత్ర కలిగిన చంద్రగిరి దుర్గం రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తున్నది. తిరుపతి-బెంగుళూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న చంద్రగిరి దుర్గం తిరుపతి నుంచి 12 కిమీ దూరంలో వుంది.

మొట్టమొదట కార్వేటినగరం సంస్థానాన్ని పరిపాలిస్తున్న ఇమ్మడి యాదవనరసింగరాయలు క్రీ.శ.1000వ సంవత్సరంలో చంద్రగిరి ప్రాంతంలో కోట నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇమ్మడి యాదవనరసింగరాయల వంశీయులు దాదాపు 314 సంవత్సరాలు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. ఆ తరువాత ఈ ప్రాంతం విజయనగరరాజుల ఆధీనంలోకి వచ్చింది. సాళువ వంశీయుల కాలంలో(క్రీ.శ1486-99) చంద్రగిరి దుర్గానికి బాగా గుర్తింపు వచ్చింది. రక్కసి-తంగడి(తళ్ళికోట) యుద్ధం క్రీ.శ.1565లో జరిగిన తర్వాత విశాలమైన విజయనగర సామ్రాజ్యం ముక్కలయింది. అప్పుడు విజయనగర సామ్రాజ్య రాజధాని పడమర నుంచి తూర్పుకు తరలి వచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం విజయనగర సామ్రాజ్యంలో రెండు రాజధాని నగరాలు ఏర్పడినాయి. ఒకప్పుడు విజయనగర రాజధానిగా ఒక వెలుగు వెలిగిన హంపీ మాజీ రాజధానిగా మారింది. అనంతపురం జిల్లాలోని పెనుకొండ, చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి విజయనగర సామ్రాజ్యరాజధానులుగా అవతరించాయి. ఆ తరువాత కొంతకాలానికి అరవీటి వంశపు రాజులు చంద్రగిరి ప్రాంతానికి వచ్చి శాశ్వత నివాసమేర్పరచుకొన్నారు. వీరిలో వేంకటపతిదేవరాయలు(క్రీ.శ.1584-1614) చంద్రగిరి దుర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. రాజమహల్, రాణిమహల్‌గా పిలవబడుతున్న విశాలమైన రాజప్రాసాదాలు వెంకటపతి దేవరాయల హయాంలోనే కట్టించారు. చంద్రగిరి పరిసర ప్రాంతాలలో శిథిలమైన భూగర్భంలో నిక్షిప్తమైన దేవాలయాలను వెంకటపతిరాయలు కట్టించినట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. క్రీ.శ. 1646లో గోల్కొండ సుల్తానుల వశమైంది చంద్రగిరి దుర్గం. 1758లో కర్నూలు నవాబు సోదరుడు అబ్దుల్ వహాఖాన్ చంద్రగిరిని తన పాలనలోకి తెచ్చుకున్నారు. కొన్నాళ్ళ తర్వాత మైసూరు మహారాజుల పరమైంది. ఆంగ్లేయులకు, మైసూరు పాలకులకు శ్రీరంగపట్టణ సంధి 1792లో జరిగిన తర్వాత చంద్రగిరి దుర్గం ఆంగ్లేయుల వశమైంది. దుర్గం ముందున్న పత్తికొండ అని పిలిచే కొండలు చంద్రవంకను పోలి వుండటంతో చంద్రపర్వతమని పిలిచేవారట. ఆ తరువాత కాలక్రమేణా చంద్రగిరిగా మారింది. ఈ ప్రాంతంలో శిథిలావస్థకు చేరువలో ఉన్న కోటలు, రాజప్రాసాదాలు, శిథిలమైన దేవాలయాలు, పుష్కరిణులు, మండపాలు ఎన్నోవున్నాయి. ఇక్కడ గల కొండ నిండా బండ వుంది. బండల మధ్య అక్కడక్కడ చిన్న పొదలున్నాయి. వీటి మధ్య నుంచి కొండపైకి ఎక్కేందుకు మెట్లున్నాయి. కొండ పైభాగంలో నాటి రాజులు తమ రక్షణార్థం ఏర్పాటు చేసుకొన్న బురుజులు చెక్కుచెదరకుండా నేటికీ చూడచ్చును. ఈ బురుజులపై నిలబడి సైనికులు పహారా కాస్తూ శత్రువుల రాకపోకలను కనుగొనేవారు. సైనికులు భోజనం చేయడానికి కంచాల మాదిరిగా చెక్కిన గోతులు కొండపైన వున్నాయి. ఇవి దాదాపు 40 వరకు ఉన్నాయి.

పత్తి కొండ అని పిలిచే కొండకు దక్షణ భాగమున ఎత్తయిన గోపురాలతో కనిపించే మూడంతస్తుల భవనాన్నే రాజమహల్‌గా పిలుస్తున్నారు. మహ్మదీయ వాస్తుసంప్రదాయాలను హిందూ శిల్ప కళలకు సమ్మిళితం చేసి మెరుగులు దిద్దిన విజయనగర శిల్పుల ప్రతిభకు ఒక ఉదాహరణ ఈ రాజప్రసాదము.

రాజమహల్‌కు తూర్పు దిక్కుగా 30 అడుగల దూరంలో ఉన్న రాజప్రాసాదమే రాణిమహల్. రాణిమహల్‌కు ఉండాల్సిన హంగులు ఏవీ కనపడకపోయినా దీనికి పక్కనే రెండు మూడు ఎత్తయిన కాపలాదార్ల కట్టడాలు(వాచ్ టవర్స్) ఉన్నాయి.

ఇక్కడున్న కొండ మీద ద్వారం లాగా రాతిచట్రం వుంది. ఇదే ఉరికంబం. దీనినే ఉరి కోటి అని పిలుస్తారు. శత్రురాజుల గూఢచారులు ఎవరైనా రాజ్యంలో ప్రవేశించి, రహస్యాలను తెలుసుకోవాలని ప్రయత్నిస్తే వారికి మరణదండన విధించి ఉరి తేసేవారని చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. రాతిచట్రానికి ఉరి తీసే దృశ్యం చుట్టుపక్కల కొన్ని కిలోమీటర్ల దూరం వరకు కనపడుతుంది. ఈ విషయం తెలిసి కోటలోనికి శత్రు గూఢచారులెవరూ వచ్చేందుకు ప్రయత్నించేవారు కారని ప్రతీతి.

ప్రతి రోజూ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సౌండ్ అండ్ లైటింగ్ కోసం కోటిన్నర రూపాయలు ఖర్చుచేశారు. మొదటి షో తెలుగులో సాయంత్రం 7 గంటల నుంచి 7.45 గంటల వరకు, రెండవ షో ఆంగ్లంలో రాత్రి 8 గంటల నుంచి 8.45 గంటల వరకు ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శన చూసేందుకు పెద్దలకు ఒక్కరికి 20 రూపాయలు, పిల్లలకు 10 రూపాయలు టిక్కెట్టు కొనుక్కుని చూడవలసి వుంటుంది. సహస్ర వసంతాల సుదీర్ఘ ప్రస్థానంలో చరిత్ర అంశాలను తనలో లీనం చేసుకుని ప్రత్యక్షసాక్ష్యంగా ఉన్న చంద్రగిరి దుర్ఘం సౌండ్ లైట్ షో చూసే వారికి వీనుల విందుగా కనులకు పసందుగా వుంటుంది. ●

దేశవాళీ క్రికెట్‌లో ప్రదర్శించే ప్రతిభే కొలమానం అయితే సాయిరాజ్ బహుతులే భారత జట్టులో ఎన్నడో స్థానం పదిలం చేసుకుని ఉండేవాడు. ముంబయికి చెందిన ఈ లెగ్‌స్పిన్నర్ బంతిని అనూహ్యంగా స్పిన్ చేసి బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టగలడు. మంచి బ్యాటింగ్ సామర్థ్యం కూడా కలవాడు. ఇటీవల జరిగిన ఇరానీ మ్యాచే ఇందుకు నిదర్శనం. ఫస్ట్‌క్లాస్‌లో అతడు **391** వికెట్లు తీసుకున్నాడు. అతడు **31.67** సగటుతో మొత్తం **3,769** పరుగులు చేశాడు. ఇందులో ఆరు సెంచరీలు, **16** అర్ధ సెంచరీలున్నాయి. చెన్నయ్‌లో జరిగిన ఇరానీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబయి తరఫున అతడు అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రతిభ ప్రదర్శించాడు. సౌరవ్ గంగూలీ, వీరేంద్ర సెహవాగ్, యువరాజ్ సింగ్ వంటి ఉద్ధండులు వైఫల్యం చెందిన మ్యాచ్‌లో బహుతులే మొదటి ఇన్నింగ్స్‌లో **58**, రెండో ఇన్నింగ్స్‌లో **36** పరుగులు చేశాడు. రెస్టాఫ్ ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. ఇరానీ కప్‌కు ముందు జరిగిన ఛాలెంజర్ సిరీస్‌లో హర్భజన్, మురళీ కార్తిక్, అమిత్ మిశ్రా కంటే అతడు మెరుగ్గా బౌలింగ్ చేశాడు. భారత జట్టులో స్థానం సంపాదించుకోవడం తన తక్షణ ఆశయమని ఇటీవల ఒక ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

ఆశల పల్లకిలో బహుతులే

● **న్యూజిలాండ్‌తో జరగనున్న ప్రాక్టీస్ మ్యాచ్‌లకు ఎంపిక చేయకపోవడం నిరాశ కలిగించిందా?**

లేదు. బాగా ఆడటంపైనే నా దృష్టి ఉంటుంది. ఇకముందు కూడా బాగా ఆడేందుకే ప్రయత్నిస్తాను. ఏదో ఒక రోజు నాకు పిలుపు వస్తుందన్న విషయం నాకు తెలుసు.

● **అనుభవజ్ఞులు, ప్రతిభ కలవారిని ఉపేక్షిస్తున్నారనే ఒక భావన ఉంది. దీనిని గురించి మీరేమంటారు?**

యువకులకు స్థానం కల్పించడం ఆహ్వానించదగ్గ పరిణామమే. అయితే చాలా కాలం నుండి దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న వారిని విస్మరించడం తగదు. వీరికి అవకాశాలు కల్పించడం అవసరం.

● **అమిత్ మిశ్రా బౌలింగ్‌కు, మీ బౌలింగ్‌కు మధ్య తేడా ఏమిటి?**

ఇతరుల బౌలింగ్‌ను నేను అంతగా గమనించను. అయితే ఇద్దరి బౌలింగ్ యాక్షన్ ఒకే విధంగా ఉంటుందని అంటారు.

● **మీకు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఆడేందుకు అంతగా అవకాశాలు రాలేదు. కారణమేమిటి?**

అనిల్ కుంబ్లే చక్కగా బౌలింగ్ చేస్తున్నందువల్ల మరో లెగ్‌స్పిన్నర్‌కు జట్టులో స్థానం కల్పించడం కష్టమే.

● **రంజీ ట్రోఫీకి మీ జట్టు ఎలా సన్నద్ధం అవుతోంది?**

సవాలును ఎదుర్కొనేందుకు మేం సిద్ధం. గత ఏడాది కూడా కష్టమైన గ్రూప్‌లోనే ఉన్నాం. మాది సమతూకంలో ఉన్న జట్టు.

● **ఈ సీజన్‌లో మీ లక్ష్యాలేమిటి?**

భారత జట్టులో తిరిగి స్థానం సంపాదించి బాగా ఆడటం నా ప్రథమ ధ్యేయం. రంజీ ట్రోఫీ గెలుచుకోవడం కూడా ధ్యేయం.

దేశంలో స్పిన్నర్లకు కొరత లేనప్పటికీ ఇటీవలి కాలంలో కల్పించిన అవకాశాలను యువ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవటంలో విఫలం అవుతున్నారు. హర్భజన్ సింగ్, అనిల్ కుంబ్లే ప్రస్తుతానికి రాణిస్తున్నప్పటికీ యువ క్రీడాకారులు ప్రతిభ చూపకపోతే స్పిన్ ఆయుధాగారం బలహీనపడక తప్పదు. అనిల్ కుంబ్లే పూర్వపు సామర్థ్యాన్ని ప్రదర్శించలేక పోతున్నాడు. హర్భజన్‌సింగ్‌ను దృష్టిలో వుంచుకొని విదేశీ జట్లు సంసిద్ధమవుతున్నాయి. ఈ తరుణంలో వెరైటీ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయగల బౌలర్లు జట్టులో వుండటం ఎంతైనా అవసరం. అమిత్ మిశ్రా, రమేష్ పవార్, మురళీ కార్తీక్ వంటి బౌలర్లు ఆశాకిరణాలుగా కనిపిస్తున్నారు. బహుతులే, కార్తీక్ ఇంతకుముందు ఇచ్చిన అవకాశాలను అంతగా సద్వినియోగం చేసుకోలేకపోయారు. ●

✳ డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

తిరగబడ్డ త్రికోణం

జంగయ్యకి జీవితంలో ఇది మొదటి అనుభవం కావచ్చు. బహుశా జీవితంలో ఇలాంటి అనుభవం ఒకసారి అందరికీ వస్తుందనుకుంటా! రావాలని కూడా ఎవరూ కోరుకోరు మరి! ఎందుకంటే అది ఆసుపత్రికి సంబంధించింది కాబట్టి.

జంగయ్య ఆసుపత్రిలో వున్నాడు. పైగా ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నాడు. ఆసుపత్రి మాట వింటేనే భయపడే జంగయ్య, ఆపరేషన్ థియేటర్‌లో పైగా ఒక ఆపరేషన్ బల్ల మీద పడుకుని వున్నాడు.

పక్క టేబుల్ మీద అప్పటికే ఏదో ఆపరేషన్ అవుతున్నట్లు గమనించిన జంగయ్య సంగతి అటు చూడలేక కళ్ళు మూసుకుని వున్నాడు. అతనికి అసలు ఏమీ అర్థం కావడం లేదు. అతన్ని అక్కడ ఎందుకు ఉంచినట్లు? తనకు కడుపు నొప్పా? కాలినొప్పా? అతని ఆలోచనలు పరిపరి విధాల పయనించడం మొదలు పెట్టాయి. అతను ఆసుపత్రిలో అడుగు పెట్టడానికి గల కారణాలను సింహావలోకనం చేసుకోవడం మొదలు పెట్టాడు.

* * *

సర్పంచ్ సాయిలు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశాడని తెలిసి ఊరు వూరంతా పంచాయతీ ఆఫీసుకు కదిలింది. సాయిలు సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత ఆ ఊరు రూపు రేఖలే మారిపోవడం మొదలు పెట్టాయి. ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశ పెట్టిన ఎలాంటి పథకం అయినా, అది ముందుగా ఆ గ్రామానికి రావలసిందే! పట్టువదలని విక్రమార్కుడని సాయిలు పని విధానం గురించి ఆ గ్రామ ప్రజలు చెప్పుకుంటుంటారు. పైగా, అతను అధికార పార్టీకి చెందిన మనిషి కావడం వల్ల నాయకుల దగ్గర, మంత్రుల దగ్గర చనువు ఎక్కువ ఉండడం వల్ల అతను చేయాలనుకున్న పని చేయించుకోవాలనుకున్న పని ఆఫీసర్ల చేతిలో నిముషాల మీద అయిపోవడం, అవి గ్రామ ప్రజలకు అత్యంత ఉపయోగకారిగా ఉండడం సర్పంచ్ సాయిలుకు గ్రామ ప్రజల్లో మంచి పేరు తెచ్చి పెట్టాయి. అధికార పార్టీ వారే కాకుండా అపోజిషన్ వాళ్ళకు కూడా అదే స్థాయిలో పనులు చేసి పెట్టడం వల్ల సర్పంచ్ సాయిలు ఆ వూరికి దేవుడయ్యాడు. అందుచేతనే అతను 'ప్రత్యేక సమావేశం' అన్నాడంటే అదేదో ఊరికి ఉపకారం జరిగే పని అన్నది ఆ గ్రామ ప్రజలకు తెలుసు.

అలా పంచాయతీ ఆఫీసుకు పరుగెత్తుకెళ్లిన ...లో జంగయ్య కూడా వున్నాడు. పంచాయితీ ఆఫీసు ...గంలోని ఖాళీ స్థలం అంతా, గ్రామ పెద్దలతో, ప్రజలతో నిండిపోయింది సర్పంచ్‌గారు నోరు విప్పి ఏమి చెబుతాడోనని. వాళ్ళంతా వచ్చినట్లు గమనించిన తరువాత సర్పంచ్ సాయిలు తనదైన శైలిలో గొంతు సవరించుకొని మాట్లాడ్డం మొదలు పెట్టాడు. అందరూ నిశ్శబ్దంగా ఉండి అతను చెప్పే మాటలు ఎంతో శ్రద్ధగా వింటున్నారు.

సర్పంచ్ చెప్పిన విషయాలు అన్నీ జంగయ్యకు అర్థం కాకపోయినా, అతనికి ప్రస్తుతం అవసరం అయిన విషయం అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. ఆ విధంగా జంగయ్యకి అర్థం అయిన విషయం ఏమంటే ఆ జిల్లా కలెక్టరు గారు తమ జిల్లాలోని ప్రజల కోసం ఒక చక్కని పథకం ప్రవేశ పెట్టారు. దాని ప్రకారం ఎవరైతే ఇద్దరు పిల్లల తర్వాత కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేయించుకుంటారో వారికి వివిధ పద్దుల మీద బ్యాంకు రుణాలు ఇప్పిస్తారు. ఆపరేషన్ చేయించుకున్నట్లు డాక్టర్ సర్టిఫికెట్‌లో అప్లికేషన్ పెట్టుకుంటే చాలు 'లోను' మంజూరు ఖాయం!

జంగయ్య పొలంలో బావి తవ్వించుకోవాలని అనుకుంటున్నాడు. అతనికి కలెక్టరు గారి పథకం సరిగ్గా సరిపోతుంది. మరి డాక్టర్ సర్టిఫికెట్ దొరికేదెట్లా? ఊళ్ళో అందరి నోటా ఇదే మాట! పంచాయతీ ఆఫీసు దగ్గర, ఎఫ్.ఎం.రేడియో ప్రతిరోజూ ఇదే వార్తా వివరాలను అందిస్తున్నది.

* * *

ప్రభుత్వ ఆసుపత్రులకు జనం విరగబడుతున్నారు. వీరంతా వైద్యుల కోసం అనుకుంటే పొరపాటే మరి! సర్టిఫికెట్ల కోసం జనం సముద్రమై అక్కడ పారుతున్నది. సంగతి గ్రహించిన డాక్టర్లు ఆనందంగా జేబులు నింపుకుంటున్నారు. సర్టిఫికెట్లకు గిరాకీ పెరిగిపోయింది. జంగయ్య ఆలోచనలో పడ్డాడు.

ఎలాగైనా తను కూడా సర్టిఫికెట్ సంపాదించాలి. అదే అతని ప్రస్తుత ధ్యేయం. ఉన్నట్లుండి అతని బుర్రలో ఒక ఆలోచన వెలిగింది. మరుక్షణమే ఆ గ్రామ వ్యవహారాలు చూస్తున్న అధికార పార్టీ చోటా నాయకుడు పోలిరెడ్డి గుర్తుకు వచ్చాడు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా పోలిరెడ్డిని కలిసి, తన వ్యవహారం వివరించి, అది లేకుండా కలెక్టర్ తనకు రుణం మంజూరు చేయడని, అది కేవలం పోలిరెడ్డి వల్ల మాత్రమే అవుతుందని, అతని ముందు కాసేపు భజన మంత్రం పఠించాడు.

జంగయ్య విషయం విన్న పోలిరెడ్డి కాసేపు ఆలోచించి మనసులోనే తనకు కూడా అర్థం కాని కొన్ని

లెక్కలు వేసి చివరికి,

'జంగన్నా! నీకు పిల్లల ఆపరేషన్ అయినాదిరా!' అన్నాడు పోలిరెడ్డి.

'రెడ్డిసాబ్! ఆపరేషన్ అయితే నీ దగ్గరకు వచ్చే అవసరం ఏముంది చెప్పు! అదికాలేదు కాబట్టి నువ్వు ఇప్పించా సర్టిఫికెట్' అన్నాడు సీదాగా జంగయ్య.

'బాగానే ఉంది, ఆపరేషన్ కాకుండా సర్టిఫికెట్ ఎలా ఇస్తాడు పాపం డాక్టర్ మాత్రం!' అనుమానం వ్యక్తం చేశాడు పోలిరెడ్డి.

"అదిగో, అక్కడే ఉంది రెడ్డి సాబ్ మతలబు రాజకీయం రంగంలోకి దిగాలె' అన్నాడు తెలివిగా జంగయ్య.

'నువ్వనుకున్నంత సులభం కాదులే జంగయ్యా! అయినా, ప్రయత్నించి చూద్దాం' అన్నాడు పోలిరెడ్డి.

"రెడ్డి సాబూ! అందుకే, నువ్ రాజకీయాల, నేను ఈ పాడు బ్రతుకుల ఇలా వెనకబడిపోయినం. మా ఊళ్ళో గంగన్న, తాతన్న, సాయిలు, భిక్షపతి, లింగారెడ్డి, లక్ష్మయ్య, వాళ్లకి ఈ సర్టిఫికెట్లు ఎట్లా వచ్చినాయంటావ్, వాళ్ళు ఆపరేషన్ చేయించుకున్నారనా? అబ్బే!!" అన్నాడు జంగయ్య చాలా సింపుల్‌గా.

ఓరి వీడి సిగదరగ, వీడు నా రాజకీయాన్నే సవాలు చేస్తున్నాడు సుమా! అని మనసులోనే అనుకొని

"సరేలే జంగన్నా! నువ్వు రేపు మా ఇంటికి పొద్దున ఎనిమిదిన్నరకల్లా రావాలె. దవాఖానాకు పోయేసరికి తొమ్మిదిన్నర అయితది. జేబులో మరి పైకం లేకుండా రాకు సుమా!" అని హెచ్చరికలాంటి హామీ ఇచ్చాడు పోలిరెడ్డి. ఆనందం నిండిన మనస్సుతో ఇంటి దారి పట్టాడు జంగయ్య.

* * *

అనుకున్న సమయం కంటే పదిహేను నిముషాలు ముందుగానే ఆసుపత్రికి చేరుకున్నారు పోలిరెడ్డి, జంగయ్యలు. అప్పటికే ఆసుపత్రిలో హడావిడి ఊపందుకుంది. ఏమూల చూచినా జనమే జనం! ఆ జనంలో పడి, తనకు తెలిసిన డాక్టర్ కోసం వెతుకుతున్నారు పోలిరెడ్డి. వెనకనుండి ఎవరో భుజం మీద చెయ్యి వేసినట్లనిపిస్తే, వెనక్కు తిరిగిన పోలిరెడ్డిని చూచి, "పోలిరెడ్డి సార్‌కి, ఈ రోజు అప్పుడే తెల్లారిందే!" అన్నాడు డా॥ శ్రీలింగం.

"ఇప్పుడు రాకుంటే మీ డాక్టర్లు ఇక్కడ దొరుకుతారా" అన్నాడు పోలిరెడ్డి పాడి నవ్వు నవ్వుతూ.

కావలసిన వ్యక్తి అనుకోకుండా త్వరగా దొరికినందుకు అతని ఆనందానికి అవధులు లేకుండా పోయినయ్.

"చెప్పండి రాసుడా? కోసుడా?" అన్నాడు తన సహజ శైలిలో డా॥శ్రీలింగం.

"రాసుడు కాదు, కోసుడు కాదు. ఇతని పేరు జంగయ్య. నాకు కావలసిన వ్యక్తి. అర్జంటుగా పిల్లల ఆపరేషన్ సర్టిఫికెట్ కావాలె!" అన్నాడు.

సర్టిఫికెట్ల వ్యవహారంలో అప్పటికే అంచనాలను మించి సంపాదించిన డా॥ శ్రీలింగం, అదే పనిగా పైకి - కిందికి చూస్తూ-

"ఆపరేషన్ ఎప్పుడు చేయించుకున్నావ్?" అన్నాడు. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలీక పోలిరెడ్డి వైపు చూశాడు జంగయ్య.

"ఆపరేషన్ అయితే నేనెందుకు వస్తా డాక్టర్ సాబ్! వీనికి దాని అవసరం ఇప్పుడు లేదు, సర్టిఫికెట్ మాత్రమే కావాలె! మీకు తెలీంది ఏముంది?" అన్నాడు డాక్టర్ ముఖంలోకి చూస్తూ పోలిరెడ్డి.

"ఆc.. అర్థమయింది గాని, పరిస్థితులు బాగా లేవు అయినా..." అన్నాడు నసుగుతూ డా॥శ్రీలింగం.

'నువ్వు ఫికరు పడకు డాక్టర్ సాబ్!



నీకిచ్చేదేదో నీకు ఇచ్చుకుంటాడు' అన్నాడు పోలిరెడ్డి.

"కష్టంగానే ఉంది పరిస్థితి. అయినా చూద్దాం" అని "అరె యాదగిరి!" - దగ్గర్లో వున్న వార్డ్ బాయ్‌ని పిలిచి" కేసు ప్రిపేర్ చేసి, ఆపరేషన్ థియేటర్‌కు పంపించు" అని పురమాయించాడు డా॥ శ్రీలింగం.

* * *

తన పరివారంతో వచ్చి, జంగయ్య పడుకున్న బల్ల పక్కన నిలబడి, ఏవేవో ఆదేశాలు ఇస్తుంటే ఆలోచనలకు స్వస్తి పలికి, ప్రస్తుతంలోకి వచ్చి డాక్టర్‌తో ఏదో చెబుదామనుకొనే లోపునే,

"జంగయ్యా, జరా-సూదికదా! చీమ కుట్టినట్లయితది భయపడకు" అంటూ కసుక్కున రెండు మూడు చోట్ల గుచ్చాడు డా॥ శ్రీలింగం.

"అమ్మో! అయ్యో!!" అని మూలిగిన జంగయ్య అయిదు నిముషాల్లో బయటపడ్డాడు.

* * *

ఆపరేషన్ థియేటర్ బయట జంగయ్య లబోదిబో మని అల్లరి చేస్తున్నాడు. సర్టిఫికెట్ కోసం జరగవలసిన తతంగాలన్నీ జరిగిపోతున్నాయ్. అయినా జంగయ్య ఎందుకు గొడవ చేస్తున్నాడో, అటు అతనిని తీసుకువచ్చిన పోలిరెడ్డికిగాని, థియేటర్‌లోపలికి తీసుకొని పోయి జంగయ్యకు ఏమేమో చేసి డా॥ శ్రీలింగానికి గాని అర్థం కావడం లేదు. అనవసరంగా ఈ పనిని తన నెత్తి మీద వేసుకున్నందుకు ఒక సమయంలో తన తాను తిట్టుకున్నాడు పోలిరెడ్డి.

జంగయ్య చేస్తున్న హడావిడికి, అతని దగ్గరకు వెళ్ళాలంటేనే పోలిరెడ్డికి ఇబ్బందిగా ఉంది. అయినా, తప్పదుమరి! సంగతేమిటో తెలుసుకోవాలి కదా! పరిస్థితి మరింత వికటిస్తే డా॥ శ్రీలింగంకు మళ్ళీ తన ముఖం ఎట్లా చూపించగలడు? పైగా డాక్టరుతో ఎప్పుడూ ఏదో పని ఉంటుందాయె! అందుకే జంగయ్యను సమీపించి.

"జంగయ్యా! ఏమిటీ నీ గోల? అసలు ఏమయింది నీకు?" అన్నాడు కాస్త స్వరం తగ్గించి.

"ఇంకేం కావాలి పోలిరెడ్డి దొరా. నీ మీద నమ్మకంతో, నీ అడుగులో అడుగు వేస్తే, నువ్ సహాయం చేస్తావనుకొంటి గాని, ఇలా దగా చేస్తావనుకోలేదు. మీరిద్దరు కలిసి ఇలా అన్యాయం చేస్తారనుకోలే!" అన్నాడు జంగయ్య ఏడుపు ముఖంతో.

"ఓర్నీ! భలేవాడివయ్యా!! డాక్టర్ సాబు నీకు సర్టిఫికెట్ తయారు చేస్తుండు. జరసేపు ఓపికపట్టాలే!" అన్నాడు.

"సర్టిఫికెట్ సంగతి అలా వుంచండి రెడ్డి సాబ్! నాకు పెళ్ళయి పదేళ్ళు అయినా నా మొదటిదాని కడుపున ఒక్క నలుసు కూడా పడలేదనే కదా, దాని చెల్లెల్ని ఈ మధ్యనే మనువాడిన. డాక్టరేమో నేను చెప్పేది అసలు వినకుండా ఇప్పుడు 'పిల్లల నరం కత్తిరించేశాడు' అన్నాడు కాస్త తగ్గు స్వరంతో.

"ఆc గట్లనా! అట్లగెట్టా జరుగుతుంది. డాక్టర్ సాబ్‌ను అడుగుతానుండు" అని డా॥ శ్రీలింగం దగ్గరకు పోయి ఆయన గదిలో ఒక పదినిముషాల పాటు ఏవేవో ముచ్చటించి వచ్చాడు పోలిరెడ్డి. జంగయ్యను సమీపించి అతని చెవిలో ఏదో గుసగుసలాడాడు. జంగయ్య ముఖంలో వెయ్యివోల్టుల కాంతి పెరిగినట్లయింది. అతని ఆనందానికి అంతు లేదు. డా॥ శ్రీలింగంను కలుసుకొని సర్టిఫికెట్‌ను జాగ్రత్తగా జేబులో భద్రపరచుకొని డాక్టర్ కాళ్ళు మొక్కాడు జంగయ్య. ఇద్దరూ మరోసారి డా॥ శ్రీలింగంకు కృతజ్ఞతలు చెప్పి ఇంటివైపు మళ్ళారు.

* * *

ఊహించినట్లుగానే జంగయ్యకు 'లోన్' శాంక్షన్ అయ్యింది. ఆపరేషన్ చేసి, సర్టిఫికెట్ ఇచ్చినందుకు డాక్టర్‌కు డబ్బు ముట్టింది. దానికి ప్రధాన కారకుడైన పోలిరెడ్డికి పేరు ప్రఖ్యాతులు లభించాయి.

పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయకుండానే చర్మం చీల్చి కుట్టు వేసిన విషయం ఆ ముగ్గురికి తప్ప బయటి వాళ్ళెవరికీ తెలీదు. కుటుంబ నియంత్రణ రోజు వారీ లెక్కల్లో ఒక సంఖ్య పెరిగింది. సిగ్గు పడ్డ ఎర్రతికోణం, తిరగబడి నేలవాలింది. ●

ప్రాథమిక విద్యావిధానంపై మంచి పుస్తకం

ఏదో ఒక ఉద్యోగం కోసం వెతికే ప్రయత్నంలో టీచర్ ట్రైనింగ్ చేసి టీచర్‌గా మారి వస్తున్న యువతరంలో ఆ వృత్తి పట్ల ఆసక్తి గాని, అంకిత భావం గానీ లేకుండా యాంత్రికంగా బోధన చేస్తూ కాలం వెళ్ళదీస్తున్న వారే ఎక్కువ మంది కన్పిస్తారు. పిల్లలపై ప్రేమ, బోధన పట్ల ఆసక్తి, ఏదో చేయాలనే తపన ఉన్న వారే నిజమైన టీచర్. పిల్లవాడ్ని దండంవనిదే బోధన అసాధ్యం అన్న నానుడిని వృత్తివరమైన శిక్షణను పొందిన వారు కూడా నమ్ముతూండటం విచారించదగ్గ విషయం. నిజమైన టీచర్‌కు బెత్తంతో పనిలేదు. పిల్లలతో కలిసిపోయి, పిల్లల స్థాయికి అనుగుణంగా బోధన జరపాలి. ప్రభుత్వం పంపిణీ చేయలేదని చేతులు ముడుచుకొని ఊరికే కూర్చోవడం కంటే పిల్లల మాతృభాష, ప్రాంతీయతలను బట్టి బోధనా పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. పిల్లల చదువులో ఆటపాటలు కూడా ఒక భాగం కావాలి. ఈ విషయాలు ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రభుత్వానికి అందరికీ తెలిసినా, ఆచరణలో మాత్రం ఇందులో వ్యతిరేక ఫలితాలను అందజేస్తున్నారు. ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేసి ఉన్నత విద్యకు ప్రాముఖ్యత నిచ్చే ధోరణి ప్రభుత్వానిది. మాతృభాషలో విద్యాబోధన ఆవశ్యకతను గుర్తించక ఇంగ్లీషు మీడియంలో వేసి పిల్లలను బట్టీ మాష్టార్లుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా తక్కువేమీ కాదు. ఇన్ని సమస్యలతో టీచర్‌కున్న బాధ్యతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

మన దేశ పరిస్థితులకనువైన విద్యావిధానం - బోధనా పద్ధతుల గురించి, అందునా ప్రాథమిక విద్యకు సంబంధించి గిజుభాయి బగేకా చేసిన కృషి అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. విద్యా విధానానికి సంబంధించి 'రైలుబడి, పంతులమ్మకు లేఖ' లాంటి అనువాద పుస్తకాలు కూడా గతంలో వచ్చాయి. ఈ కోవలో వచ్చిన మరో కొత్త పుస్తకమే ఎస్.ఏ.వార్నర్ రచించిన 'టీచర్' అనువాదం. 81 శాతం యూరోపియన్లు, 9 శాతం మెయిరీలు, 3 శాతం పొలిటీషియన్లు ఉన్న న్యూజిలాండ్‌లో మెయిరీ శిశుమందిరాలలో పని చేసి, ప్రయోగాలు చేసిన వార్నర్ ధృవపరచి ఇచ్చిన పరికరమే "ఆర్గానిక్ టీచింగ్". ఆ సజీవ బోధనా క్రమాన్ని ఏ ఏ మెళకువలతో తాను నిర్వహించిందో తేటతెల్లం చేస్తున్న పుస్తకమే 'టీచర్'.

"టీచర్"
రచన : ఎస్.ఎ.వార్నర్
తెలుగు: వి. శ్రీహరి, డి. పాపారావు
వెల : రు.40
ప్రచురణ మరియు ప్రతులకు :
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

జీవి అభివృద్ధిలో చదువు ఒక భాగమేనని భావించే ఈ పుస్తక రచయిత్రి 'టీచింగ్ ఈజ్ యాన్ ఆర్గానిక్ ప్రాసెస్' అంటారు. క్రమశిక్షణ పేరుతో పిల్లల తెలివితేటలను, ఆలోచనా విధానాన్ని అణచివేయడం భావ్యం కాదు. పిల్లలు వాళ్ళలో వాళ్ళు, వాళ్ళ నుంచి వాళ్ళు నేర్చుకునే ప్రక్రియలో బోధన సహకరించాలి. బోధన పుస్తక కేంద్రంగా కాకుండా శిశుకేంద్రంగా మారినప్పుడే ఆ శిశువు యొక్క సర్వతో ముఖాభివృద్ధికి సానుకూలత ఏర్పడుతుంది.

టీచర్ ప్రవర్తన ఎలా వుండాలో చెప్పడమే కాకుండా, ఉత్తమమైన బోధనా విధానం ఎలా వుండాలో ఈ పుస్తకం వివరిస్తుంది. పిల్లల మనోభావాలను, అభిప్రాయాలను తెలుసుకునే ఓపిక, సహనం కూడా టీచర్‌కు ఉండాలని రచయిత్రి అభిప్రాయం. సరళ అనువాదం పుస్తకాన్ని హాయిగా చదివింప చేస్తుంది. సీతారాం రాసిన ముందుమాట ఈ పుస్తకానికి ప్రత్యేక ఆకర్షణ.

- కె.పి.అశోక్ కుమార్

శ్రీకారం



బుదడు (స్మృతి కావ్యం)
రచన : ఛాయరాజ్; వెల : రు. 20/-;
ప్రతులకు : ఛాయ్, ఇ.నెం. 16-230/24ఎ, పాతపోస్టాఫీసు వీధి, గుజరాతిపేట, శ్రీకాకుళం; మైత్రీబుక్ హౌస్, విజయవాడ; విశాలాంధ్ర, ప్రజాశక్తి, దిశ, నవోదయ, మణి బుక్‌స్టాల్ (నెల్లూరు)

సూర్య నమస్కారములు
ప్రతులకు : న్యూమార్కెటింగ్ సర్వీసెస్, కార్పొరేట్ ఆఫీస్, 1-13-53/2, ఎస్.బి.ఐ. శ్రీరామ్‌నగర్ ఎదుట, కాకినాడ - 533 003.

మోటుసామెతలు
రచన : టి.వి.నారాయణ; వెల : రు. 8/-;
ప్రతులకు : టి.వి.నారాయణ, జర్నలిస్ట్, బి.వై.నగర్, సిరిసిల్ల - 505 301.

నటన మాడెనూ హరుడు
నటరాజరూపుడై
నగజాతసహితుడై.....

అంటూ శివ పార్వతులనుద్దేశించిన కూచిపూడి నృత్యరూపకాన్ని తన అభినయంతో నాట్యప్రియుల్ని అలరింపచేస్తున్న బేబిసాయి తేజస్వి నాట్యాభినయం అపురూపం. పన్నెండేళ్ళ ప్రాయంలోనే సాయితేజస్వి వందలాది నాట్య ప్రదర్శనలు చేసి అనేక సత్కారాలు పొందారు. కడప పట్టణానికి చెందిన సాయితేజస్వి తల్లితండ్రులైన పార్వతమ్మ, జె.బి.యానాదయ్యల ప్రోత్సాహంతో నాట్యకళారంగంలో రాణిసుకతన్న సాయి తేజస్వి గురించి ఈ వారం తెలుసుకుందాం.

నాట్యకళాయశస్వి.... సాయితేజస్వి

స్థానిక నాగార్జున హైస్కూలులో ఎనిమిదవ తరగతి చదువుతున్న తేజస్వి తొలుత నాట్య గురువులు శ్రీమతి అరుణా రామకృష్ణ, చల్లా జగజ్జీవనరావు గార్ల వద్ద నాట్యాభ్యాసాన్ని మొదలెట్టారు. ప్రస్తుతం హైదరాబాదులో నాట్యచూడామణి శోభానాయుడు, నాట్యాచార్య మహంకాళిమోహన్, వేదాంత రాఘవుల వద్ద కూచిపూడి నృత్యంలోని మెళకువలను అభ్యసిస్తున్న సాయితేజస్వి చిరు ప్రాయంలోనే పరిణతి చెందిన నాట్యకళాకారిణిలా హావభావాలను ప్రదర్శిస్తూ కూచిపూడి నృత్యంతో పాటు విభిన్న నృత్య రీతుల్లో అసమాన ప్రతిభను ప్రదర్శిస్తూ పలు జిల్లాల్లో, రాష్ట్ర, జాతీయస్థాయి నృత్య పోటీలలో విజేతలవుతున్నారు.

సాయితేజస్వి నృత్య ప్రదర్శనలలో గణేష్ పంచరత్నం, సాయిదర్శనం, సూర్యాష్టకం, శివపార్వతుల శృంగార తాండవం, జయదేవుని అష్టపదులు, నారాయణీయం, భామాకలాపం, దశావతారం, తరంగం, ధనశ్రీ థిల్లానా వంటి నృత్యాలు కళాభిమానులచే విశేష ఆదరణ పొందాయి. 1997 ఏప్రిల్ ఎనిమిదిన ఉగాది రోజున కడప జిల్లా మాధవరం సీపంలోని శ్రీ షిరిడీసాయిబాబా ఆలయంలో మొదటిసారిగా తన నృత్య ప్రదర్శనను ఇచ్చారు. ఇప్పటి వరకు 350కి పైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చిన తేజస్వి చిరుప్రాయంలోనే ఫ్రాన్స్, హాలెండ్, జర్మనీ, బెల్జియం దేశాలలో పర్యటించి తన ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. జిల్లా కీర్తిని ఖండాంతరాలకు వ్యాపింపజేశారు. హైదరాబాద్ జవహర్ బాలభవన్‌వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి 'బాలశ్రీ' అవార్డు-22 ఎంపికలోనూ, గిఫ్టెడ్ చైల్డ్ అవార్డు పోటీలలోనూ ద్వితీయ స్థానం సంపాదించారు. సాయి తేజస్వి ప్రతిభను గుర్తించి రాష్ట్ర సాంస్కృతిక శాఖ గుర్తింపు కార్డు జారీ చేశారు. మద్రాస్ తెలుగు అకాడమీ వారి 'సమైక్య భారత్ గౌరవ్ సత్కార్-2003' పురస్కారాన్ని సిక్కిం గవర్నర్ వి.రామారావు చేతుల మీదుగా, జస్టిస్ పి.సి. రెడ్డి ట్రస్ట్ 'కళాప్రతిభ-2003' అవార్డు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సి.వై. సోమయాజులు చేతుల మీదుగా, ఢిల్లీ తెలుగు అకాడమీ వారి 'జూనియర్ ఎక్సలెన్సీ-2003' పురస్కారాన్ని కర్నాటక గవర్నర్ టి.ఎన్. చతుర్వేది చేతుల మీదుగా అందుకున్నారు. వివిధ కళాసంస్థల ద్వారా ప్రజ్ఞాబాల, బాలకళారత్న, నాట్యమయూరి, నృత్యభారతి, నాట్యసుధ, నాట్య కళాయశస్వి, బాలనృత్యరవళి బిరుదులతోపాటు, నేషనల్ యునెస్కో క్లబ్ వారి బంగారు పతకాన్ని సాధించారు. ఇటీవల జరిగిన కడప ఉత్సవాల్లో భాగంగా నాట్య చూడామణి శోభానాయుడు సరసన నృత్య ప్రదర్శనలిచ్చి అభిజ్ఞులు, అధికారుల మన్ననలు పొందారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పిలే కాక రాష్ట్రస్థాయిలో జరిగిన ప్రదర్శనల సందర్భంగా సినీ రంగ ప్రముఖులు అక్కినేని, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, సాయికుమార్, ఊర్వశి శారదల నుండి అభినందనలు అందుకున్నారు. సమాజసేవపట్ల అంకితభావాన్ని కలిగి ఉన్న సాయితేజస్వి ఒరిస్సా వరదబాధితుల కోసం, గుజరాత్ భూకంపబాధితుల కోసం, కార్గిల్ అమరవీరుల సహాయనిధి కోసం కడప కళాక్షేత్రంలో నృత్య ప్రదర్శనలు ఇవ్వడమే కాక తనవంతు విరాళాన్ని ఇచ్చారు. తనకు వివిధ సందర్భాల్లో లభించే నగదు రివార్డులలోని ఫలితాన్ని ప్రతినెలా విరాళంగా స్థానిక సాయిబాబా అనాథశరణాలయానికి ఇస్తున్నారు. సాయితేజస్వి ప్రతిభ గురించి వారి తండ్రి జె.బి. యానాదయ్యను ప్రజాశక్తి ప్రశ్నించగా తన కూతురిలోని కళాభిరుచిని గుర్తించి ప్రోత్సహిస్తున్నానన్నారు. దీనికి తోడు వివిధస్థాయిల్లో కూచిపూడి నృత్యంలో ఉద్దండులైన ప్రముఖ గురువుల ప్రోత్సాహం తన బిడ్డకు మెండుగా ఉందన్నారు. కళలకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందిన కడప జిల్లా కీర్తిని అంతర్జాతీయంగా తీసుకెళ్ళడమే తన కూతురి లక్ష్యమని, అందుకు తాను ప్రోత్సహిస్తున్నానన్నారు. నిత్య సాధనతో నాట్యరంగంలో కృషి చేస్తున్న ఈ చిన్నారి మరింతగా నాట్యరంగంలో రాణించాలని కోరుకుందాం. ●



'జూనియర్ ఎక్సలెన్సీ-2003' అవార్డు స్వీకరిస్తున్న సాయితేజస్వి

రెటీనా, కంటినరం చూపుకు సంబంధించిన సంకేతాలు మెదడుకు పంపుతాయి.

కంటిలోపల ఒత్తిడి పెరిగి కంటి నరం దెబ్బతినడాన్ని 'గ్లకోమా' అంటారు. కొన్నిసార్లు కంటినరం బలహీనంగా ఉండి, రక్తప్రసరణ తక్కువ ఉండటం వలన కంటిలో ఒత్తిడి కొద్దిగా పెరిగినా లేక మామూలు ఒత్తిడికే కంటినరంలో గ్లకోమాకు సంబంధించిన మార్పులు రావచ్చు.

ఇది అన్నిటికన్నా ప్రమాదకరమైన వ్యాధి కోట్లాది మంది ఈ వ్యాధి వలన శాశ్వతంగా అంధులవుతున్నారు. తొలి దశలో చూపులో మార్పు ఉండనందువల్ల దీనిని గుర్తించలేరు. గ్లకోమాను గుర్తించి చికిత్స ఆరంభించే సమయానికి ఉన్న చూపు నిలపటానికి వీలవుతుందే తప్ప అప్పటికే కోల్పోయిన చూపును తిరిగి మెరుగు పరచడానికి వీలుపడదు.

గ్లకోమా నివారించగలిగే జబ్బు కాదు. కానీ తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స చేయడం ద్వారా కంటి చూపును తగ్గకుండా కాపాడుకొనవచ్చు. రెగ్యులర్‌గా కంటి పరీక్షను చేయించుకొనడం ద్వారా ఈ వ్యాధిని తొలిదశలోనే గుర్తించడానికి వీలవుతుంది. ఈ గ్లకోమా అనే వ్యాధి పుట్టుకతో కూడా ఉండవచ్చు.

లక్షణాలు :

- ☛ సినిమా చూసిన తర్వాత లేదా చీకటిలో గడిపిన తర్వాత కంటి చుట్టూ నొప్పిగా అనిపించడం.
- ☛ కరెంట్ బల్బు చుట్టూ రంగువలయాలు కనబడటం, ప్రత్యేకంగా ఉదయం పూట, రాత్రిళ్ళు.
- ☛ తరచూ కంటి అద్దాలు మార్చవలసి రావటం.
- ☛ రాత్రిపూట చూపు తగ్గటం, మసకబారటం.
- ☛ కంటి దృష్టి పరిధి క్రమేణా తగ్గిపోవడం.



నీటి కాసులు



పరీక్షలు :

ఎప్లనేషన్‌టోనోమెట్రి : ఇది కంటిలో ఒత్తిడి కొలిచే సున్నితమైన పరికరం. ప్రపంచ వ్యాప్తంగా ఆమోదించబడిన పద్ధతి. కంటి ఒత్తిడిలో కొద్దిపాటి మార్పులు కూడా కనుగొనవచ్చు.

గొనియోస్కోపి : కంటిలోపలి భాగాలను పరిశీలించడానికి ఉపయోగపడుతుంది.

పెరిమెట్రి : ఇది కంటినరం స్థితిని తెలుసుకొనడానికి ఉపయోగపడుతుంది. కంటి దృష్టి పరిధిని తెలుసుకొనడానికి ఉపకరిస్తుంది.



గ్లకోమాలో కంటి దృష్టి పరిధి క్రమేణా తగ్గిపోతుంది.



ఆటోమేటెడ్ పెరిమెట్రి : ఇది కంటి చూపు పరిధిని తెలుసుకొనే అత్యాధునికమైన పరికరం. గ్లకోమా వ్యాధి ఏ దశలో ఉందో తెలుసుకొనవచ్చు. తొలిదశలోనే గ్లకోమా కనుగొనుటకు వీలు ఉంటుంది. కేవలం



గ్లుకోమా గురించే కాక మెదడుకు సంబంధించిన వ్యాధులకు కూడా ఇది ఉపయోగపడుతుంది.

పైన పేర్కొన్న పరీక్షలన్నీ ప్రతి ఒక్కరికీ అవసరం ఉండదు.

చికిత్స : కంటిలోకి మందులు వాడటం అనేది చాలా ముఖ్యం. మందులు వాడటం వలన ప్రెషర్ పెరగకుండా ఉంటుంది. కాని డ్రాప్స్ ఎల్లప్పుడూ విడువకుండా వాడుతూ తరచూ కంటిలో ప్రెషర్ చెక్ చేయించుకుంటూ ఉండాలి. ఈ చుక్కలు కచ్చితంగా డాక్టరు వివరించిన విధంగా వాడాలి. లేని పక్షాన కంటి వత్తిడి తగ్గదు. మందులు వాడుతున్న కంటినరం బలహీనమవుతుంటే ఆపరేషన్ చేయాలి. గ్లుకోమాకు చికిత్స ఉన్నా చూపు నిలపటానికి మాత్రమే ఉపయోగపడుతుంది. కానీ చూపు మెరుగుపరచటం కష్టం. కొంతమందిలో ఆపరేషన్ జరిగిన తరువాత కూడా చూపు తగ్గే అవకాశం ఉంది. కంటినరం బలహీనమవటం లేదా శుక్లం ఏర్పడటం వలన కూడా చూపు తగ్గి పోతుంది.

లేజర్ చికిత్స : ఇది కంటిలో అధికంగా వున్న ఫ్లూయిడ్ బయటకు డ్రెన్ చేయడం ద్వారా కంటి వత్తిడిని తగ్గిస్తుంది. కాని ఇది అందరికీ ఉపయోగపడదు. ఆపరేషన్ లేదా లేజర్ చికిత్స అనంతరం కూడా కంటి ప్రెషర్ కంట్రోల్ చేయడానికి, చూపు తగ్గకుండా ఉండటానికి కొందరిలో మందులు కూడా వాడవలసిన అవసరం పడవచ్చు. ●

గ్లుకోమా ఉన్న వారు గుర్తుంచుకోవలసిన విషయాలు :

- వంశపారంపర్యంగా లేదా ఇతర కుటుంబ సభ్యులలో గ్లుకోమా వున్నచో వెంటనే కంటి డాక్టర్‌ను సంప్రదించి కంటి ఒత్తిడి, కంటిలోని నరం పరీక్ష చేయించుకొనటం చాలా ముఖ్యం.
- డ్రాప్స్, బిళ్ళలు డాక్టర్ వివరించిన విధంగా వాడటం చాలా అవసరం. మందులు సరిగా వాడకపోవడం వలన చూపు తగ్గిపోయే ప్రమాదం ఉంది.
- గ్లుకోమా చికిత్స పొందుతున్న వారు కనీసం మూడు నెలలకు ఒకసారి కంటి డాక్టరుతో పరీక్ష చేయించుకొని మందులు వాడుతుండాలి.
- కంటి డ్టారును సంప్రదించకుండా ఏ విధమైన కంటి మందులూ వాడరాదు.
- వంశపారంపర్యంగా గ్లుకోమా వున్నవారు, కంటికి దెబ్బ తగిలిన వారు, శస్త్రచికిత్స జరిగిన వారు, 35 సంవత్సరాలు పైబడిన వారు, బి.పి., డయాబెటిస్ వున్న వారు రెగ్యులర్‌గా కంటి పరీక్ష చేయించుకోవటం వలన ఈ వ్యాధిని తొలి దశలోనే గుర్తించి చూపు తగ్గకుండా కాపాడటానికి సాధ్యపడుతుంది.
- డాక్టర్ సలహా తీసుకోకుండా గ్లుకోమా మందులు వాడటం ఆపరాదు.

డాక్టర్ జి.ఎస్.కె.శేఖర్,
జనవిజ్ఞాన వేదిక, సబ్‌కమిటీ మెంబర్, హైదరాబాద్

డాక్టర్ సలహాలు

✱ నాకు చేయి, కాలు చచ్చు వచ్చినట్లు లోలోపల కుక్క నమిలినట్లు నొప్పిగా ఉంది. ఇద్దరు, ముగ్గురు డాక్టర్ల వద్ద చూపించుకున్నాను. తగ్గలేదు. అలా ఎందుచేత రావచ్చు. తగ్గుతుందా? ఏమేమి మందులు వాడవచ్చు? వాడాలి? సుగర్, బి.పి.లు లేవు.

– సత్యం

మీ వయస్సు రాయలేదు. ఈ సమస్య ఎంతకాలంగా వుందో కూడా రాయలేదు. మీరిచ్చిన వివరాలను బట్టి ఆయా ప్రదేశాలను నియంత్రించే నాడీ వ్యవస్థ ఒత్తిడికి లోనై ఇలా జరిగి ఉండొచ్చు. మీరు న్యూరోఫిజీషియన్‌ని సంప్రదించండి. మీ అవస్థ కొంతైనా తగ్గే అవకాశముంది.

✱ నా భార్య సత్యవాణికి 36 రోజులు జలుబు తుమ్ములు వస్తున్నాయి. వర్షాకాలం పని చేసుకుంటూ తడిలో వర్షంలో వుంటుంది. పొద్దున్న పనులు వుంటాయి కదండి. ఎంతోమంది డాక్టర్‌ల దగ్గరకు వెళ్లాము. కాని తగ్గలేదు. మందులు వాడినపుడు తగ్గుతుంది. మళ్ళీ తర్వాత వస్తూనే ఉంది. కావున మా యందు దయ ఉంచి ఏ మందులు వేసుకుంటే దగ్గు జలుబు, తుమ్ములు తగ్గుతాయి. తెలుపగలరు.

– వందనపు రాంబాబు, భద్రాచలం

ఇది వైరస్ వల్ల గాని, అలర్జీ వల్లగాని రావచ్చు. దీనికి శాశ్వత పరిష్కారం లేదు. పడుకోబోయే ముందు, అలరిడ్ అనే మాత్రను రోజుకొకటి చొప్పున వేసుకోవాలి. మూడు రోజుల తరువాత ఫలితం లేదనిపిస్తే ఇఎన్‌టి సర్జన్‌ని సంప్రదించండి.

✱ నేను ఎండలో తిరిగితే ముక్కు భాగం, నుదురు భాగం నల్లగా మారుతుంది. ఎండకు ఎక్స్‌పోజ్ అయిన చర్మం అంతా నల్లగా వస్తుంది. కావున నాకు మంచి ఆయింట్‌మెంట్‌ను సూచించగలరు.

– ఒక పాఠకుడు.

ఇది సూర్యరశ్మి వల్ల వచ్చే ఓ రకమైన ఎలర్జీ. దీనినే ఫొటో డర్మటైటిస్ అంటాము. నల్లగా మారే ప్రదేశాలకు సూర్యరశ్మి సోకకుండా చూసుకోవడమే దీనికి సరైన నివారణోపాయం. ఎండలో బయటకు వెళ్ళేటప్పుడు టోపి పెట్టుకోవడం లేక గొడుగు వాడటం ద్వారా ఎండ నుంచి రక్షణ పొందాలి. అలాగే ఎండలో తిరగాల్సి వచ్చినప్పుడు ఫొరామినాల్ క్రీమ్‌ని నల్లగా మారే ప్రదేశాలపై పూతగా పెట్టుకొంటే ఇలా మచ్చలు పడకుండా వుంటుంది. దీనికి శాశ్వత పరిష్కారమేమీ లేదు.

పలుకు'బడి' — ✻ కొండబాబు

వాక్యం.. వాక్యం..



"వెరీగుడ్.. వ్యాసం బాగుంది. మంచి విషయాలు రాశావ్" మెచ్చుకోలుగా చూస్తూ అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ధన్యుణ్ణి మహాప్రభో.. అంతా తమ చలవే. తమరి ప్రోత్సాహం వల్లే రాయగలిగాను" విట్టీగా నవ్వుతూ బదులిచ్చాడు కైలాసం.

"ఊ.. ఇంకేం రాయాలనుకుంటున్నావ్?" ప్రశ్నించాడు సుబ్రహ్మణ్యం.

"నేనేమీ అనుకోవడం లేదు.. మనం ఇద్దరం చర్చించుకున్న అంశాలలో నుంచి వచ్చిన వాటినే రాయాలనుకుంటున్నాను. నువ్వు ఏ విషయంపైనైనా చర్చ ఓపెన్ చేస్తే.. దాన్నుంచి వచ్చే క్లారిటీయే వ్యాసం."

"అంతే తప్ప నీ ప్రొఫెషనల్ అనుభవం నుంచి కాదన్నమాట" ఎత్తి పొడుపుగా అన్నాడు.. పెద్దగా నవ్వాడు కైలాసం.

"అనుభవం .. చర్చ పరస్పర ప్రేరేపితాలోయ్.."

"ఇంతకీ ఏం రాయాలనుకుంటున్నావో చెప్పలేదు. ఇకనుంచి రెగ్యులర్‌గా రాయాలి. పత్రికల్లో నాణ్యతకు కొంతవరకైనా అవి ఉపయోగపడాలి."

సరే.. సరే.. వాక్య నిర్మాణంలో సహజశైలి.. స్పష్టత గురించి రాద్దామనుకుంటున్నాను."

"గతంలో ఒకసారి అనుకున్నాం కదా.. గుడ్ బాగుంటుంది. ఎలాగో.. కొన్ని వాక్యాలు చెప్పు.. లేదా ఇప్పటికే రాసివుంటే ఆ ప్రతి ఇవ్వు."

"రాయలేదు గానీ, ఒక్కొక్కాయన లెటర్ రాస్తే ఆ వాక్యాలు చెప్పదలచుకున్న విషయం కాక వేరే అర్థమవుతుంటాయి. అందులో జోకులూ ఉంటాయి. అలాంటి వాక్యాలే ఇవి. చెపుతాను...

" 'యువజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా జరిపారు' అని రాస్తారు.. సంఘం ఆధ్వర్యంలో ఎవరు జరిపారు? రైతులా? కూలీలా? విద్యార్థులా? కార్యకర్తలా?

ఇలాంటి వాక్యం రాసినపుడు ఎవరు జరిపారో 'కర్త'ను రాయాలి. లేదా ఇదే వాక్యాన్ని 'కర్త' లేకుండా 'యువజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా జరిగింది" అని రాయాలి.

అలాగే మరొక వాక్యం. 'డిడిఆర్‌సి సమావేశంలో పంటలకు నీరివ్వాలని తీర్మానాలు చేసి పంపినా ప్రభుత్వం స్పందించలేదు'. ఈ వాక్యంలో మొదటివాక్యం ఒకింత గందరగోళాన్ని సృష్టిస్తోంది. 'డిడిఆర్‌సి సమావేశంలో పంటలకు..? సమావేశంలో పంటలేంటి? ఇవి పదక్రమం సరిగ్గాలేని వాక్యాలు. ఈ వాక్యాన్ని "పంటలకు నీరివ్వాలని డిడిఆర్‌సి సమావేశంలో తీర్మానాలు చేసి పంపినా ప్రభుత్వం స్పందించలేదు' అని రాయాలి.

'నీరివ్వమని చెప్పామని, అయినా ఆ పార్టీ వారు దానిని సరిగ్గా అర్థంచేసుకోలేదని ఆయన అన్నారు'

ఈ వాక్యాన్ని ఆ పార్టీ వారే కాదు.. ఎవరూ సరిగ్గా అర్థం చేసుకోరు.

నీరివ్వమని చెప్పారట.

'నీరు ఇవ్వము' అనా? 'నీరు ఇవ్వుము' అనా? ఇక్కడ వ్యావహారికంలో సంధి కలిసింది. అది అపసవ్యం కావడం వల్ల శబ్దాలు కలిసిపోయి అర్థం కావడం లేదు. నీరు ఇవ్వాలని చెపితే 'నీరు ఇవ్వాలని చెప్పినా' అని రాసుకోవాలి. 'ఇవ్వము' అని చెప్పితే 'నీరు ఇవ్వబోమని చెప్పినా' అని రాసుకోవాలి.

ఇవీ సార్ నేను రాయాలనుకుంటన్నవి" కైలాసం చెప్పాడు.

"బాగున్నాయోయ్.. దోషాలన్నీ తప్పులుగా కనిపించని దోషాలు. ఇవి సరి అయితే విషయం చక్కగా అర్థమవుతుంది. నువ్వు చెప్పిన వాక్యనిర్మాణ దోషాలన్నీ వేర్వేరు తరహాలకు చెందినవి. వాటినన్నీ కలగలిపి రాయకుండా విభజించి రాయి" సలహా ఇచ్చాడు సుబ్రహ్మణ్యం.

"ఒకే అలాగే"

"మొత్తం ఒకే వ్యాసంగా రాసినా రెండు మూడు భాగాలుగా విడగొట్టు.. అదీ ఒక క్రమంలో.. లేదంటే నీ వ్యాసం ఈ వాక్యాల్లాగే ఉంటాయ్."

నవ్వుకున్నారు ఇద్దరు.

పాఠక స్పందన

యువతను పాడు చేస్తున్న ప్రభుత్వం

సెప్టెంబర్ 28 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'యువతను నిర్వీర్యం చేస్తున్న పాశ్చాత్య సంస్కృతి' కవర్ స్టోరీ బాగా వివరించారు. ఆనందం కోసం హతమవుతున్నాం. ఇలాంటి డబ్బు మదంతో దేన్నైనా కొనగలిగే సంస్కృతి మనకొద్దు. ఈ సంస్కృతి యువతను పిచ్చి పిచ్చి చేస్తోంది. ఆ పిచ్చి పిచ్చి చేసే సంస్కృతి ఎంత నాశనం చేస్తోందో యువత ఆలోచించాలి. ఈ హైటెక్ ప్రభుత్వం పట్టించుకుంటే బార్ అండ్ రెస్టారెంట్ యాజమాన్యం ఇంతటి వికృతమైన చేష్టలు చేయదు. డాన్సర్లపై జరిగే హింస, క్యాబరే డాన్సర్లపైన జరిగే అరాచకాలను ఖండించాలి. ప్రభుత్వం తలచుకుంటే హైకోర్టు ఎందుకు పర్మిషన్ ఇస్తుంది. కనుక మన సంస్కృతిని మనమే తీర్చిదిద్దుకోవటానికి యువత అంతా కదలి రావాలి. ఇంకా 'మనిషి కోసం' కవిత చాలా బాగుంది. బాల వికాసంలో 'డబ్బు విలువ తెలియజెప్పాలి' కూడా మమ్మల్ని అలరించింది. రియల్ స్టోరీ మోసగాని గుట్టును బట్టబయలుచేసింది.

– వెనిగళ్ళ నాగరాజు, గుంటూరు

జీవనశైలి బాగుంది

సెప్టెంబర్ 14 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'జీవనశైలి' చాలా బాగుంది. నేటి సినిమా నిర్మాతలు 'ప్రేమ' పేరుతో కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇవి చూస్తున్న టీనేజీ పిల్లలు వెర్రివాళ్ళవుతున్నారు. ప్రపంచంలో అత్యంత గొప్పది 'ప్రేమ' అన్నట్లు వ్యవహరిస్తూ.... 'ప్రేమ' సక్సెస్ కాకపోతే ఆత్మహత్యలు చేసుకుంటూ నిండు జీవితాన్ని బలి చేసుకుంటూరు. వాస్తవిక జీవితానికి దూరంగా నేటి సినీ పరిశ్రమ ఉంది.

– వాసు, చైతన్య, వెంకటాపురం, ఖమ్మంజిల్లా

రు

చి

రాగి ఇడ్లీ

కావలసిన వస్తువులు :

రాగిపిండి - 60 గ్రాములు

బియ్యం - 150 గ్రాములు

మినప్పప్పు - 75 గ్రాములు

పెరుగు - 150 గ్రాములు

టమాటాలు - అరకిలో

ఇడ్లీ ప్లేట్లకు రాసేందుకు తగినంత నూనె

అవసరమైతే నీళ్ళు, ఉప్పు తగినంత

గమనిక: టమాటా పేస్టుకు బదులు సన్నగా తరిగిన పాలకూర గాని, తురిమిన క్యారెట్, బీట్‌రూట్‌ను గాని వేసి ఇడ్లీలు చేయవచ్చు.

పోషక విలువల్లు :

- ఈ ఇడ్లీలు రెండు తింటే 180 కిలో క్యాలరీల శక్తి లభిస్తుంది.
- వీటిలో 6.4 గ్రాముల ప్రొటీన్లు
- 1.5 గ్రాముల కొవ్వు పదార్థాలు ఉంటాయి.
- ఇవి గుండెకు చాలా మేలు చేస్తాయి.

తయారు చేసే పద్ధతి :

బియ్యం, మినప్పప్పును విడివిడిగా మూడు గంటల సేపు నానబెట్టాలి. మినప్పప్పును కొంచెం గట్టిగా మెత్తగా రుబ్బుకోవాలి. బియ్యాన్ని దోసె పిండి మాదిరిగా రుబ్బాలి. రెంటినీ కలిపి రాత్రంతా లేదా ఆరు గంటలు ఉంచాలి. ఉదయాన్నే అందులో ఉప్పు, పెరుగు, రాగిపిండి కలపాలి. టమాటాలకు తొక్క తీసేసి పేస్టులా చేసుకోవాలి. ముందుగా కలిపి ఉంచిన పిండిని ఇడ్లీ ప్లేట్లలో సర్దాలి. వాటిపై ఒక్కో టేబుల్ స్పూన్ చొప్పున టమాటా పేస్టును ఉంచాలి. వీటిని కుక్కర్‌లో లేదా ఇడ్లీ పాత్రలో ఉంచి 15 నుంచి 20 నిముషాలపాటు ఇడ్లీల వలె ఉడికించాలి. వీటిని చట్నీతో తింటే రుచిగా ఉంటాయి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు

అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761,
మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది